**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 107, పేజీలు - 08

శనివారం,అక్టోబర్ 17, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## ఎమ్మెల్సీ పోరుకు
# కాంగ్రెస్ సన్నద్ధం

**- అభ్యర్థుల ఎంపికలో బీఆర్ఎస్, బీజేపీ మల్లగుల్లాలు!**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వేడి అప్పుడే రాజకీయ వర్గాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఎమ్మెల్సీ పోరుకు సంబంధించి అధికార కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ ముందస్తు ప్రచారంలో జోరు పెంచగా, ప్రతిపక్ష బీఆర్ఎస్ , బిజెపి మాత్రం ఇప్పటికీ తమ అభ్యర్థులను ఖరారు చేయలే మల్లగుల్లాలు పడుతున్నాయి. పట్టభద్రుల ఎన్నికల్లో సాధారణ ఎన్నికల మాదిరిగా కాకుండా ఓటర్ల నమోదు ప్రక్రియే అత్యంత

### అభ్యర్థి ఎంపికే కీలకం

అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తోంది. అభ్యర్థుల ఎంపికలో వేగం పెంచడమే కాకుండా, గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు బాధ్యతను నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులకు అప్పగించింది. పట్టభద్రులను నేరుగా కలిసి ఓటర్లుగా నమోదు చేయించడంలో కాంగ్రెస్ శ్రేణులు ఇప్పటికే క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తున్నాయి. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, ఉద్యోగ నియామకాల ప్రచారాన్ని పట్టభద్రుల వద్దకు తీసుకెళ్తూ, ఓటర్ల నమోదును ఓ సవాలుగా తీసుకుని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రచారంలో ముందంజలో ఉన్నాయి.

కీలకం కావడం, అభ్యర్థి ఎవరో తేలితే తప్ప క్షేత్రస్థాయి క్యాడర్‌లో పూర్తిస్థాయిలో ఉత్సాహం రాకపోవడంతో ఆయా పార్టీల్లో అంతర్గత చర్చలు తుదిదశకు చేరుకున్నాయి.

### బీజేపీలో టిక్కెట్ కోసం రేస్

మరోవైపు బీజేపీలో పట్టభద్రుల ఎమ్మెల్సీ టికెట్ కోసం తీవ్ర పోటీ నెలకొంది. గతంలో హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు మళ్లీ రేసులో ముందున్నారనే ప్రచారం బలంగా సాగుతోంది. ఆయనతో పాటు పార్టీ ముఖ్య నేతలు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కూడా టికెట్ రేసులో

2లో..

## అయోమయంలో భారత విదేశాంగ అధికారులు

**- మోదీ కోరుకుంటే తానే వివరిస్తానన్న రాహుల్**




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత పర్యటనపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. రూబియో ముంబయిలో భారత ప్రభుత్వ అధికారులతో సమావేశం కానున్న విషయంపై విదేశాంగ శాఖ అధికారులకే స్పష్టత లేదని విమర్శించారు. ఆ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ వివరణ ఇవ్వాలని అన్నారు. ఒకవేళ మోదీ కోరుకుంటే తానే వివరిస్తానంటూ ఎక్స్ లో వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఇటీవల రూబియో పర్యటనకు సంబంధించిన వివరాలను వెల్లడించిన నేపథ్యంలో

2లో..

## తెలంగాణకు తరలివచ్చిన
# హ్యుందాయ్ మోటార్స్

**- ఇండియా ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కార్ల తయారీ పరిశ్రమ స్థాపించడానికి హైదరాబాద్ అనువైన ప్రాంతమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హ్యుందాయ్ ఇండియా సంస్థకు తెలిపారు. తెలంగాణలో తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరించడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డితో హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ఇంజినీరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యోన్ చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం సమావేశమైంది.'భౌగోళికంగా తెలంగాణ దేశంలో మధ్య భాగంలో ఉంది. దేశంలోని ఆరు ప్రధాన మెట్రో నగరాల్లో హైదరాబాద్ కాస్మోపాలిటన్ నగరంగా, అత్యంత సురక్షితమైనదిగా, జీవించేందుకు అత్యంత అనుకూలమైన నగరంగా గుర్తింపు పొందింది'అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇక్కడి సానుకూల పరిస్థితులను వివరించారు.

### నిమ్జ్‌లో రూ.8,528 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు

జహీరాబాద్‌లోని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్‌లో హ్యుందాయ్ మోటార్ ఇండియా

2లో..

## రైతులను త్యాగాలు కోరడమా?

**- ప్రభుత్వంపై కవిత విమర్శ**

- ఎల్ నినో ప్రభావంపై రేవంత్ ప్రభుత్వం విఫలమైందని కవిత విమర్శ
- ముందస్తు హెచ్చరికలు ఉన్నా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని ఆరోపణ
- వ్యవసాయ కూలీలకు రూ.12,000, జీవిత బీమా అందించాలని డిమాండ్




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, ఎల్ నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో రాబోయే నీటి కొరతను ఎదుర్కొనేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తీవ్రంగా విమర్శించారు. ఆమె బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వం దూరదృష్టి కోల్పోయిందని ఆరోపించారు. ఎల్ నినో ప్రభావంపై నిపుణులు గత

2లో..

# సమర్థులైన అభ్యర్థులే బరిలోకి

**- స్థానిక సంస్థల ఎన్నికలపై సీఎం చంద్రబాబు ఫోకస్**

అమరావతి (ప్రశ్న న్యూస్) పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి భాగస్వామ్య పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు పూర్తయింది. స్థానిక సంస్థల ఎన్నికలకు అభ్యర్థులను ఖరారు చేసే కీలక ప్రక్రియను తెలుగుదేశం పార్టీ ప్రారంభించింది. ముఖ్యమంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఈ ప్రక్రియలో భాగస్వాములవుతున్నారు. క్షేత్రస్థాయిలో సమగ్రంగా అభిప్రాయాలను సేకరించి అభ్యర్థులను ఎంపిక చేసే పని మొదలు పెట్టారు. ఇప్పటికే పార్టీ వద్ద ఉన్న సమాచారంతో పాటు ఇతర మార్గాల ద్వారా కూడా సమాచారాన్ని సేకరిస్తున్నారు. అభ్యర్థుల ఎంపికపై ప్రజల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నారు. సమర్థమైన నాయకత్వంతో, ప్రజలకు సేవ చేయాలనే నిబద్ధతతో పని చేసే సరైన వ్యక్తిని సరైన స్థానంలో నిలబెట్టడమే లక్ష్యంగా ఈ వడపోత కార్యక్రమం జరుగుతోంది.




### ట్రిపుల్ ఇంజన్ సర్కారు ఏర్పాటుతో రాష్ట్ర అభివృద్ధి

మరోవైపు మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు ప్రతి మునిసిపాలిటీ విషయంలోనూ ఈ కసరత్తు ముమ్మరంగా సాగుతోంది. ఈసారి మేయర్లు, మునిసిపల్ ఛైర్మన్ల ఎన్నిక అనేది ప్రత్యక్ష పద్ధతిలో జరగనుంది. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని అభ్యర్థుల ఎంపికపై వివిధ కోణాల్లో ఆలోచించి నిర్ణయం తీసుకోనున్నారు. ఈ మేరకు ప్రజామోదం కలిగి, ఆయా స్థానాలకు

2లో..

## ఇది కాంగ్రెస్ చేతగానితనం వల్ల
# వచ్చిన కరవు

**- 1,000 టీఎంసీల నీళ్లను వృధాగా దిగువకు వదిలారు**

- కన్నెపల్లి, దేవాదుల పంపులను సక్రమంగా వినియోగించలేదని విమర్శ
- పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి పంపులు ఆన్ చేయలేదని ఆరోపణ
- ఎల్‌నినో హెచ్చరికలున్నా ముందస్తు ప్రణాళికలు లేవని మండిపాటు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న నీటి ఎద్దడికి ప్రకృతి కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో కనిపిస్తున్నది కాలం తెచ్చిన కరవు కాదని, కాంగ్రెస్ సర్కారు తెచ్చిన 'చేతకాని కరవు' అని విమర్శించారు. పంపులు ఆన్ చేయకుండా, రిజర్వాయర్లను నింపకుండా

2లో..

## రాహుల్ తాటాకు చప్పుళ్లకు
# భయపడం

**- 2029 వరకు మోదీ ప్రధానిగా ఉండాలని ప్రజలు తీర్పు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలను ఆయన "తాటాకు చప్పుళ్లు"గా అభివర్ణించారు. ప్రజాతీర్పును గౌరవించకుండా, దేశంలో అరాచకాన్ని సృష్టించి ప్రభుత్వాన్ని కూలదోయాలని విపక్షాలు పగటి కలలు కంటున్నాయని ఆయన ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం కల్పించిన

2లో..

## ఎస్ఐఆర్ పై తెలంగాణ కాంగ్రెస్ మాస్టర్ ప్లాన్

**- హైదరాబాద్‌లో భారీ సభకు రెడీ**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) అంశంపై కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఢిల్లీలో నిరసన కార్యక్రమాలు నిర్వహించిన హస్తం పార్టీ ఇప్పుడు దక్షిణాదిలోనూ ఈ అంశాన్ని ప్రధాన రాజకీయ అజెండాగా మార్చేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా

2లో..

## కనకదుర్గమ్మకు
# పట్టువస్త్రాలు సమర్పణ

- సీఎం చంద్రబాబు దంపతులు చీర, సారె సమర్పణ
- సీఎంకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన అధికారులు
- దర్శనానంతరం పండితుల వేదాశీర్వచనం



విజయవాడ (ప్రశ్న న్యూస్) ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీసమేతంగా దర్శించుకున్నారు. దసరా నవరాత్రుల సందర్భంగా ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు, సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు సీఎం తెలిపారు. దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి దంపతులకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ ముఖ్యమంత్రికి పరివేష్టం అలంకరించారు. అనంతరం సీఎం పట్టువస్త్రాలు, సారెను అమ్మవారికి సమర్పించారు . పండితుల వేదమంత్రాల నడుమ అమ్మవారి అంతరాలయానికి

2లో..

# సీజేపీ అధినేత అభిజీత్ దీప్కే అరెస్ట్!

**- అదుపులోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు**

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** కాక్రోచ్ జనతా పార్టీ తలపెట్టిన తిరంగా మార్చ్‌కు కొన్ని నిమిషాల ముందు ఆ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను ఢిల్లీ పోలీసులు శుక్రవారం ఆయన నివాసంలోనే అదుపులోకి తీసుకున్నారు. వారం వ్యవధిలోనే సీజేపీ అధినేత అభిజీత్ దీప్కేను పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఇది రెండోసారి. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)లో అక్రమాలు జరిగాయంటూ సీఈసీ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపేందుకు గతంలో ఆయన ముంబై నుంచి ఢిల్లీకి విమానంలో చేరుకోగానే పోలీసులు తొలిసారి అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే.ఈ తిరంగా మార్చ్ చేపడుతుండటానికి మరో ముఖ్య కారణం అక్టోబర్ 13న




2లో..

# ఎమ్మెల్సీ పోరుకు కాంగ్రెస్ సన్నద్ధం

ఉండటంతో అభ్యర్థిత్వం కొలిక్కిరావడం లేదు. ముగ్గురు చొప్పున అభ్యర్థుల పేర్లతో కూడిన నివేదికలను రాష్ట్ర కమిటీ కేంద్ర నాయకత్వానికి పంపినట్లు సమాచారం. అయితే, పార్టీ అభ్యర్థిపై అధికారిక స్పష్టత వచ్చే వరకు స్థానిక క్యాడర్ సంపూర్ణంగా ఓటర్ల నమోదు ప్రక్రియలో పాల్గొనలేకపోతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### బలమైన అభ్యర్థుల కోసం బీఆర్ఎస్ తంటాలు

విపక్ష బీఆర్ఎస్ పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. వరుస ఎన్నికల పరాజయాల తర్వాత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాన్ని దక్కించుకోవడం ద్వారా మళ్లీ పుంజుకోవాలని ఆ పార్టీ భావిస్తోంది. అయితే పట్టభద్రుల నియోజకవర్గాలు విస్తారంగా ఉండటంతో పాటు ప్రచార వ్యయం కూడా అధికంగా ఉండే అవకాశం ఉండటంతో, ఆర్థికంగా బలంగా ఉన్న నేతల వైపే అధిష్టానం మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో పట్టు ఉండి, ఆర్థిక వనరులను సమకూర్చుకోగల సీనియర్ నేతలతో బీఆర్ఎస్ అధిష్టానం సంప్రదింపులు జరుపుతోంది. సరైన అభ్యర్థి దొరకడంలో జరుగుతున్న జాప్యం వల్ల జిల్లాల్లో బీఆర్ఎస్ క్యాడర్ దిశానిర్దేశం లేక వేచిచూసే ధోరణిలోనే ఉండిపోయింది.

### పార్టీ ప్రభావం తక్కువ.. అభ్యర్థి ప్రభావం ఎక్కువ !

పట్టభద్రుల ఎన్నికల్లో పార్టీ గుర్తు కంటే అభ్యర్థి వ్యక్తిగత ఇమేజ్, విద్యావంతులలో ఉన్న ప్రజాదరణ, ముందస్తు ప్రచారమే ప్రధాన పాత్ర పోషిస్తాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఓటర్ నమోదులో వేగం చూపిస్తుంటే, బిజెపి అర్బన్ ప్రాంతాల్లో ఉన్న తన సాంప్రదాయ ఓటు బ్యాంకుపై ధీమాతో ఉంది. ఇక బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ వ్యతిరేక ఓటును ఆకర్షించాలని చూస్తోంది. కానీ, అభ్యర్థుల ప్రకటన ఆలస్యమయ్యే కొద్దీ ఆయా పార్టీల క్యాడర్‌లో క్రియాశీలత తగ్గి, ఓటర్ల నమోదు ప్రక్రియ మందగించే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమరం రోజురోజుకూ ఆసక్తికరంగా మారుతోంది. కాంగ్రెస్ తన స్పీడ్‌తో ప్రత్యర్థులపై ఒత్తిడి పెంచుతుంటే, బిజెపి, బీఆర్ఎస్ పార్టీలు వీలైనంత త్వరగా అభ్యర్థులను ఖరారు చేసి ప్రకటన విడుదల చేయాలని భావిస్తున్నాయి. రాబోయే కొద్ది రోజుల్లో ప్రధాన పార్టీలన్నీ అభ్యర్థులను రంగంలోకి దించితే తప్ప పట్టభద్రుల నియోజకవర్గాల్లో అసలైన పొలిటికల్ హీట్ మొదలయ్యే అవకాశం కనిపించడం లేదు.

# అయోమయంలో భారత విదేశాంగ అధికారులు

రాహుల్ పలు వ్యాఖ్యలు చేశారు. వచ్చే వారం ముంబయిలో భారత ప్రభుత్వ అధికారులతో రూబియో సమావేశమవుతారని, ఆ భేటీలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా పాల్గొంటారని భావిస్తున్నట్లు గోర్ తెలిపారు. దీనిపై స్పందించిన రాహుల్, భారత విదేశాంగ శాఖలోనే ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉందంటూ కేంద్రంపై తాజాగా విమర్శలు గుప్పించారు.

### అధికారులంతా అయోమయంలోనే!

మార్కో రూబియో తన ఉద్యోగిని ముంబయికి పిలిపించుకున్నారంటూ రాహుల్ తన పోస్టులో పేర్కొన్నారు. విదేశాంగ శాఖలోని అధికారులు ఏం జరుగుతుందో తెలియక అయోమయంలో ఉన్నారని ప్రధాని మోదీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఆ విషయం గురించి మోదీ వివరించాల్సి ఉంటుందని, లేదంటే తానే వివరించాల్సి వస్తుందంటూ సోషల్ మీడియాలో పోస్ట్ ద్వారా ఎద్దేవా చేశారు రాహుల్ గాంధీ.

### గోర్ ఎందుకు వెల్లడిస్తున్నారు.?

అయితే రూబియో పర్యటనపై కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే కేంద్రప్రభుత్వాన్ని ప్రశ్నించింది. భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో రూబియో భేటీ గురించి అమెరికా రాయబారి వివరాలు వెల్లడించడంపై అభ్యంతరం తెలిపింది. ఇలాంటి విషయాలను భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ప్రకటించాల్సి ఉండగా, అమెరికా రాయబారి ఎందుకు వెల్లడిస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రశ్నించారు. భారత విదేశాంగ మంత్రి దేశంలో నిర్వహించే సమావేశాల వివరాలను ఇతరులు ప్రకటించడం అసాధారణమని ఆయన వ్యాఖ్యానించారు. రూబియో ముంబయిలో భారత ప్రభుత్వ అధికారులను కలుస్తారని చెప్పడం ఒకటైతే, ఆ సమావేశానికి జైశంకర్ కూడా వస్తారని అమెరికా రాయబారి ప్రకటించడం మరో విషయమని పేర్కొన్నారు.

### అక్టోబర్ 17 నుంచి 22 వరకు పర్యటన

బ్లూమ్‌బర్గ్ న్యూ ఎకానమీ ఫోరంలో జరిగిన చర్చ సందర్భంగా గోర్ ఆ వివరాలను వెల్లడించారు. రూబియో ముంబయిలో భారత ప్రభుత్వ అధికారులతో సమావేశమవుతారని, దిల్లీ నుంచి మరికొందరు అధికారులు కూడా అక్కడికి వస్తారని చెప్పారు. జైశంకర్ కూడా ఈ సమావేశంలో పాల్గొంటారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఆ ప్రకటనే ఇప్పుడు కాంగ్రెస్ విమర్శలకు కారణమైంది. అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, రూబియో అక్టోబర్ 17–22 వరకు ఉజ్బెకిస్థాన్, భారత్‌లో పర్యటించనున్నారు. తొలుత ఉజ్బెకిస్థాన్‌లోని సమర్‌కండ్‌కు వెళ్లి, అక్కడ సెంట్రల్ ఆసియా దేశాలతో జరిగే సీ5+1 మంత్రుల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం భారత్‌కు వచ్చి ముంబయి, గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో పర్యటిస్తారు. భారత్‌లో పర్యటన సందర్భంగా సీనియర్ ప్రభుత్వ అధికారులతో సమావేశమై ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై చర్చించనున్నారు. ఇంధన రంగంలో పరస్పర సహకారాన్ని పెంచుకునే అవకాశాలపైనా చర్చలు జరపనున్నారు. వ్యాపార రంగానికి చెందిన ప్రముఖులతోనూ రూబియో సమావేశమై వాణిజ్యం, పెట్టుబడులకు సంబంధించిన అంశాలపై మాట్లాడనున్నారు.

### వాణిజ్యం, ఇంధన రంగాలపై దృష్టి

రూబియో పర్యటన రాజకీయ చర్చలకే పరిమితం కాకుండా వ్యాపార సంబంధాలపైనా ప్రధానంగా దృష్టి పెట్టనుంది. భారత్– అమెరికా మధ్య వాణిజ్యం, ఇంధన సహకారం, సాంకేతిక రంగంలో భాగస్వామ్యం, పెట్టుబడుల అవకాశాలు ఆ పర్యటనలో కీలకంగా ఉండనున్నాయి. అమెరికా కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెట్టడం, ఇరు దేశాల మధ్య వ్యాపార సంబంధాలను మరింత విస్తరించడం వంటి అంశాలపై చర్చలు జరిగే అవకాశం ఉంది. ఈ ఏడాది మే 23 నుంచి 26 వరకు రూబియో భారత్‌లో పర్యటించారు. ఇప్పుడు ఆయన చేపట్టనున్న పర్యటన ఈ ఏడాదిలో రెండో అధికారిక పర్యటన కానుంది.

# రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం

ప్రజాస్వామ్య హక్కులను ప్రతిపక్షాలు దుర్వినియోగం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. "పది నెలల్లో మోదీ ప్రభుత్వం కూలిపోతుంది" అంటూ కొన్ని పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన ఆయన, ఇది ప్రజాతీర్పును అవమానించడమేనని పేర్కొన్నారు."ప్రధానిగా నరేంద్ర మోదీ 2029 వరకు కొనసాగాలని ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చారు. అయితే, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాల్లో ప్రభుత్వాలను మార్చినట్లుగా ఇక్కడ కూడా చేయాలని ప్రతిపక్షాలు దింపుడుకల్లం ఆశలతో ఉన్నాయి.

వారి ఆశలు ఎప్పటికీ నెరవేరవు" అని కిషన్‌రెడ్డి విమర్శించారు. ప్రపంచ దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నప్పటికీ, ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం స్థిరంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ పనితీరును చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. రాహుల్ గాంధీ చేసే తాటాకు చప్పుళ్లకు మోదీ ప్రభుత్వం భయపడదని, తమ ప్రభుత్వం అత్యంత స్థిరంగా ఉందని, పూర్తికాలం కొనసాగుతుందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

# సీజేపీ అధినేత అభిజీత్ దీప్కే అరెస్ట్!

జంతర్ మంతర్ వద్ద జరిగిన ఘటన. జంతర్ మంతర్‌ను నిరసన ప్రాంతంగా డీనోటిఫై చేసిన మరుసటి రోజే అక్కడ జాతీయ జెండాతో ప్రవేశించినందుకు కాక్రోచ్ జనతా పార్టీ సభ్యులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను పోలీసులు అరెస్ట్ చేసి 5 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. దీనికి నిరసనగా కాక్రోచ్ జనతా పార్టీ ర్యాలీకి పిలుపునిచ్చింది. అయితే నేడు అభిజీత్ దీప్కేను అదుపులోకి తీసుకోవడానికి ముందే ఆయన ఇంటికి వెళ్లిన ఢిల్లీ పోలీసులు, ఈ మార్చ్ నిర్వహించవద్దంటూ అధికారికంగా నోటీసులు అందజేశారు. బీఎన్ఎస్ సెక్షన్ 163 ప్రకారం జారీ చేసిన ఈ నోటీసులో ఢిల్లీ నగర కేంద్రమైన కన్నాట్ ప్లేస్ పరిసర ప్రాంతాల్లో నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయని పోలీసులు వెల్లడించారు.

అంతే కాకుండా ఈ తిరంగా మార్చ్ కు న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్(ఎన్డీఎంసీ) ఎలాంటి ముందస్తు అనుమతి ఇవ్వలేదని ఒకవేళ అనుమతి లేకుండా ర్యాలీ కొనసాగిస్తే చట్టాన్ని ఉల్లంఘించినట్లే అవుతుందని హెచ్చరించారు.గాంధీ బొమ్మ ఉన్న తెల్లటి టీ-షర్ట్, బ్లూ డెనిమ్స్ ధరించి భుజంపై జాతీయ జెండా వేసుకున్న 31 ఏళ్ల అభిజీత్ దీప్కేకు పోలీసులు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. జాతీయ జెండాను ఎగురవేయడం నేరం కాదని, కానీ అనుమతి లేకుండా జనాన్ని సమీకరించి ర్యాలీ నిర్వహించడం నిబంధనల ఉల్లంఘన కిందకే వస్తుందని స్పష్టం చేశారు. అలాగే జాతీయ జెండా నియమావళి ప్రకారం జెండాను గౌరవప్రదంగా నిర్వహించాలని సూచించారు. ఇదిలా ఉండగా నోటీసులు అందుకుంటున్న సమయంలో "నాపై ఎలాంటి ఆరోపణలు మోపుతున్నారు?" అని అభిజీత్ దీప్కే పోలీసులను ప్రశ్నించగా దానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.

# సమర్థులైన అభ్యర్థులే బరిలోకి

తగిన అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఉన్న అన్ని విధానాలను పాటిస్తున్నారు. ప్రజల నిత్యజీవితాలతో స్థానిక సంస్థల పాలనకు ప్రత్యక్ష సంబంధం ఉంటుంది. అందుకే అత్యుత్తమ నాయకత్వాన్ని ప్రజలకు అందించేందుకు తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉంది. స్థానిక ఎన్నికల్లో కూడా సమర్థ నాయకత్వం ఇవ్వడం ద్వారా ట్రిపుల్ ఇంజన్ సర్కారు ఏర్పాటుతో రాష్ట్రాన్ని మరింత వేగంగా, సమర్థవంతంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు నాయుడు పని చేస్తున్నారు.

### కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే షెడ్యూల్ విడుదలైంది. అయితే తొలివిడతలో పురపాలక ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కూటమి పార్టీలు సీట్ల సర్దుబాటుపై వాడివేడిగా చర్చించారు. పలు దఫాలుగా కూటమి పార్టీలు చర్చించిన అనంతరం గురువారం సాయంత్రం సీట్ల సర్దుబాటుపై కూటమి పార్టీలు కీలక ప్రకటన చేవాయి. ఏపీలో స్థానిక ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు జరిగినట్లు ఆ ప్రకటనలో తెలిపింది. ఇందులో భాగంగా టీడీపీకి 11, జనసేనకు నాలుగు కార్పొరేషన్లు, బీజేపీకి రెండు కార్పొరేషన్లు మేర సర్దుబాట్లు జరిగినట్లు తెలుస్తోంది.

### సీట్ల సర్దుబాటు వివరాలు ఇవే!

– తెలుగుదేశం పార్టీ – 11

**విజయనగరం, గ్రేటర్ విశాఖపట్నం, మచిలీపట్నం, మంగళగిరి–తాడేపల్లి, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, కడప, కర్నూలు, తిరుపతి, చిత్తూరు.**

– జనసేన – 4

**శ్రీకాకుళం, కాకినాడ, ఏలూరు, విజయవాడ**

– భారతీయ జనతా పార్టీ – 2

**రాజమహేంద్రవరం, అనంతపురం**

మున్సిపాలిటీ సీట్లపైనా సర్దుబాటు

పురపోరుకు కూటమి పార్టీలు సై అంటున్నాయి.ఇప్పటి వరకు సీట్ల సర్దుబాటుపై తర్జనభర్జన పడ్డ కూటమి పార్టీలు చివరకు సీట్ల సర్దుబాటు విషయంలో ఒక నిర్ణయానికి వచ్చేశాయి. ఈ క్రమంలో మట్నత్తం 17 మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ స్థానాలకు సంబంధించి సీట్ల సర్దుబాటు చేసింది. దీంట్లో తెలుగుదేశం పార్టీకి 11 స్థానాలు, బీజేపీకి రెండు స్థానాలు, జనసేనకు నాలు స్థానాలు ఇచ్చింది.ఇక మున్సిపాలిటీ సీట్ల విషయంలోనూ కూటమి పార్టీలు ఒక కొలిక్కి వచ్చాయి. మట్నత్తం 106 స్థానాలకు గానూ టీడీపీ 74, జనసేన పార్టీ 25, బీజేపీ 7 స్థానాల్లో పోటీ చేయనున్నాయి.

### ఉమ్మడి తూ.గో.లో జనసేనదే పైచేయి.. 7 స్థానాలు!

ఇకపోతే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కూటమి పార్టీల మధ్య మున్సిపాలిటీలు, నగర పంచాయతీల సీట్ల పంపకం పూర్తయింది. మొత్తం 12 స్థానాల్లో జనసేనకు 7, టీడీపీకి 5 కేటాయించారు. తుని, గొల్లప్రోలు, పిఠాపురం, సామర్లకోట, ముమ్మిడివరం, అమలాపురం, నిడదవోలు జనసేనకు దక్కగా.. ఏలేశ్వరం, పెద్దాపురం, రామచంద్రపురం, మండపేట, కొవ్వూరు టీడీపీకి కేటాయించారు.

# రైతులను త్యాగాలు కోరడమా?

సంవత్సరం ప్రారంభంలోనే హెచ్చరించినప్పటికీ, ప్రభుత్వం ఆ విషయానికి పట్టించుకోలేదని, సకాలంలో నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమైందని ఆమె పేర్కొన్నారు. పొరుగు రాష్ట్రాలు ఇప్పటికే కరవు మండలాలను ప్రకటించి కేంద్రానికి నివేదికలు సమర్పించాయని, కానీ తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు రైతులను త్యాగాలు చేయాలని కోరడం దారుణమని ఆమె విమర్శించారు. కవిత, రాబోయే 10 నెలలు రాష్ట్రం తీవ్ర నీటి కొరతను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. అధికారంలోకి వచ్చిన 30 నెలల తర్వాత కూడా పాత ప్రభుత్వంపై నిందలు వేయడం ఎంతవరకు సబబు అని ఆమె ప్రశ్నించారు. వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12,000 అందించే పథకాన్ని తక్షణమే అమలు చేయాలని, కరవు పరిస్థితుల దృష్ట్యా వారికి జీవిత బీమా సౌకర్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు.కవిత, ఈ సమయంలో యాదాద్రి పవర్ ప్లాంట్‌ను ప్రైవేటు రంగానికి అప్పగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. ప్రైవేట్ కంపెనీలతో ఏవైనా ఒప్పందాలు జరిగాయా? అని ఆమె నిలదీశారు. రేవంత్ రెడ్డి ఢిల్లీలో రాజ్యాంగ విలువల గురించి మాట్లాడుతున్నప్పటికీ, రాష్ట్రంలో మాత్రం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని ఆమె విమర్శించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు ఏవీ లేవని, కేవలం మాటలతోనే వ్యవహరించడం సరిపోదని ఆమె స్పష్టం చేశారు. కరవు పరిస్థితులపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపించడం, రైతులపై ఒత్తిడి పెంచడం అనేది అసహ్యంగా ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. రైతుల సంక్షేమానికి సంబంధించి ప్రభుత్వానికి సరైన దిశలో చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.ఈ నేపథ్యంలో, కవిత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తూ, రైతుల సమస్యలను పరిష్కరించడానికి తక్షణ చర్యలు అవసరమని తెలిపారు. కరవు పరిస్థితుల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని ఆమె అన్నారు. రైతులకు అవసరమైన సహాయాన్ని అందించకపోతే, రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం ఏర్పడే అవకాశం ఉందని ఆమె హెచ్చరించారు. రైతుల సంక్షేమానికి సంబంధించి ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు, చర్యలు సమర్థవంతంగా ఉండాలని ఆమె కోరారు. ఈ విధంగా, కవిత ప్రభుత్వానికి కఠినమైన సందేశాన్ని పంపించారు, రైతుల సంక్షేమం కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆమె పునరుద్ఘాటించారు.

# తెలంగాణకు తరలివచ్చిన హ్యుందాయ్ మోటార్స్

ఇంజినీరింగ్ సమగ్ర గ్లోబల్ ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా హ్యుందాయ్ ఇండియా ప్రతినిధి బృందానికి హామీ ఇచ్చారు. నిమ్జ్‌లో రూ.8,528 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న హ్యుందాయ్ కేంద్రం ద్వారా మొత్తం 4,276 ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యాన్ని సంస్థ నిర్దేశించుకుంది. 678 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టును దశలవారీగా అభివృద్ధి చేయనున్నారు. ప్రాజెక్టు పురోగతిని హ్యుందాయ్ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రికి వివరించింది. రానున్న కొన్ని నెలల్లో ఈ కేంద్రానికి శంకుస్థాపనకు సిద్ధం చేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

### భవిష్యత్తులో ఓడరేవులతో హైస్పీడ్ రవాణా అనుసంధానం

2024లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు సమావేశాల సందర్భంగా తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం హ్యుందాయ్ మోటార్స్ ప్రతినిధులతో సమావేశమైంది. అనంతరం 2025 జూన్‌లో హ్యుందాయ్ ప్రతిపాదించిన ప్రతిష్ఠాత్మక ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు మంత్రివర్గ పారిశ్రామిక, పెట్టుబడుల ప్రోత్సాహక ఉపసంఘం ఆమోదం తెలిపింది. అనంతరం 2025 జూన్‌లో హ్యుందాయ్ ప్రతిపాదించిన ప్రతిష్ఠాత్మక ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు మంత్రివర్గ పారిశ్రామిక, పెట్టుబడుల ప్రోత్సాహక ఉపసంఘం ఆమోదం తెలిపింది.

తెలంగాణలో కార్ల తయారీ పరిశ్రమను స్థాపించేందుకు రాష్ట్రం అత్యంత అనుకూలమైన ప్రదేశమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ప్రత్యేక మొబిలిటీ క్లస్టర్లు, రహదారి, విమాన, రైలు మార్గాల ద్వారా బలమైన రవాణా మౌలిక సదుపాయాలు, భవిష్యత్తులో ఓడరేవులతో హైస్పీడ్ రవాణా అనుసంధానాన్ని అభివృద్ధి చేసే ప్రణాళికలు రాష్ట్రానికి మరింతగా అనుకూలంగా మారుతాయని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. తయారీ రంగం అభివృద్ధి కోసం పెరి-అర్బన్ రీజియన్ వంటి ప్రణాళికాబద్ధమైన ప్రాంతీయ అభివృద్ధి నమూనాల ద్వారా తెలంగాణ వేగవంతమైన పారిశ్రామిక విస్తరణకు సిద్ధంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

### తెలంగాణ అభివృద్ధి ప్రస్థానంలో మా భాగస్వామ్యాన్ని కొనసాగిస్తాం

ప్రపంచ స్థాయి సౌకర్యాలతో భారత్ ఫ్యూచర్ సిటీతోని నిర్మించాలన్న ప్రభుత్వ దార్శనికతను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. 2026లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026లో పాల్గొనాల్సిందిగా హ్యుందాయ్ నాయకత్వ బృందాన్ని ఆహ్వానించారు. హెచ్ఎంఐఈ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యోన్ చో మాట్లాడుతూ "తెలంగాణ అభివృద్ధి ప్రస్థానంలో మా భాగస్వామ్యాన్ని కొనసాగిస్తాం" అని తెలిపారు.

హైదరాబాద్‌లో హ్యుందాయ్ మోటార్స్ ఇప్పటికే హైటెక్ సిటీలోని కేంద్రం అధునాతన వాహన ఇంజినీరింగ్‌కు సంబంధించిన పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా సేవలందిస్తోంది. హ్యుందాయ్ ఇండియా ఇంజినీరింగ్ సామర్థ్యాలను మరింత విస్తరించే క్రమంలో, జహీరాబాద్ నిమ్జ్‌లో ఏర్పాటు చేయనున్న ఆర్ అండ్ డీ కేంద్రం, భారీ వాహన పరీక్షా కేంద్రం వాహనాల పరీక్షలు, పనితీరు ధ్రువీకరణ, ఇంజినీరింగ్ ప్రక్రియల మెరుగుదలలో కీలక పాత్ర పోషించనుంది.ఈ సమావేశంలో సీఎం సలహాదారు, ఎక్స్-అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు , కలెక్టర్ ప్రతీక్ జైన్‌తోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ పై తెలంగాణ కాంగ్రెస్ మాస్టర్ ప్లాన్

హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ, మార్చ్ నిర్వహించేందుకు తెలంగాణ కాంగ్రెస్ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. సుమారు రెండు లక్షల మందిని సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు.

### సర్ పై రాహుల్ గాంధీ పోరాటం.. రాష్ట్రాలకు ఏఐసీసీ టాస్క్

ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోతున్నాయంటూ కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ అంశంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ జాతీయ స్థాయిలో పోరాటాన్ని కొనసాగిస్తోంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తోంది. ఇదే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ రాష్ట్ర యూనిట్లకు ఏఐసీసీ కార్యాచరణను సూచిస్తోంది. తెలంగాణలోనూ పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర నాయకత్వానికి ఆదేశాలు అందినట్లు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. దక్షిణాదిలోని రెండు రాష్ట్రాల్లో భారీ సభలు నిర్వహించాలన్నది కాంగ్రెస్ అధిష్ఠానం ప్రణాళికగా వెల్లడించారు.

### దక్షిణాదిపై ప్రత్యేక ఫోకస్.. అసలు వ్యూహం ఇదేనా?

సర్ అంశాన్ని కాంగ్రెస్ కేవలం ఓటర్ల జాబితాల సమస్యగానే కాకుండా ప్రజాస్వామ్య హక్కులు, ఎన్నికల పారదర్శకతకు సంబంధించిన అంశంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావిస్తోంది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో ఓటర్ల తొలగింపుల వల్ల ఎలాంటి ప్రభావం ఉంటుందనే అంశంపై పార్టీ దృష్టి సారిస్తోంది. మరోవైపు, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) జరిగితే జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాలకు పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉందనే చర్చ ఇప్పటికే రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నేపథ్యంలో సర్, డీలిమిటేషన్ అంశాలను అనుసంధానిస్తూ దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలపై ప్రజల్లో చర్చను పెంచాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో విశ్లేషణలు వినిపిస్తున్నాయి.అయితే సర్ కారణంగా తెలంగాణలో 28 శాతానికి పైగా ఓట్లు తొలగిపోయే ప్రమాదం ఉందన్నది కాంగ్రెస్ వర్గాలు ప్రస్తావిస్తున్న ఆందోళన. ఈ సంఖ్యకు సంబంధించి అధికారిక నిర్ధారణను ఎన్నికల సంఘం గణాంకాలతో సరిపోల్చాల్సి ఉంది.

### హైదరాబాద్‌లో భారీ సభ.. 2 లక్షల మందితో మార్చ్?

తెలంగాణలో సర్ కు వ్యతిరేకంగా భారీ స్థాయిలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. దసరా తర్వాత హైదరాబాద్‌లో బహిరంగ సభతో పాటు మార్చ్ నిర్వహించే దిశగా కసరత్తు చేస్తోంది. సుమారు రెండు లక్షల మందిని సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. ఈ కార్యక్రమానికి రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా జాతీయ స్థాయి నేతలను ఆహ్వానించే అంశంపై పార్టీ నాయకత్వం దృష్టి సారిస్తోంది. అయితే సభకు హాజరయ్యే నేతలు, తేదీ, వేదికపై తుది అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

### సీఎం రేవంత్‌తో పీసీసీ చీఫ్ భేటీ.. ఏర్పాట్లపై చర్చ

భారీ సభ నిర్వహణకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డితో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సమావేశం కానున్నారు. సభకు జన సమీకరణ, మార్చ్ నిర్వహించే మార్గం, సభా స్థలం, ట్రాఫిక్ మళ్లింపులు, పార్టీ శ్రేణుల భాగస్వామ్యం వంటి అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం. ఏఐసీసీ సూచనలకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నేతలు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై కాంగ్రెస్ నాయకత్వం దృష్టి సారిస్తోంది. ఇప్పటికే హైదరాబాద్‌లో సర్ కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించిన కాంగ్రెస్ రాబోయే సభ ద్వారా తన రాజకీయ పోరాటాన్ని మరింత విస్తరించాలని భావిస్తోంది.

### కాంగ్రెస్‌కు రాజకీయంగా కలిసొస్తుందా?

సర్ పై నిరసనలను కొనసాగించడం ద్వారా ఎన్నికల సంఘం పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తడంతో పాటు బీజేపీపై రాజకీయ ఒత్తిడి పెంచాలని కాంగ్రెస్ వ్యూహరచన చేస్తోంది. మరోవైపు, ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన పెంచడం కూడా ఈ కార్యక్రమం లక్ష్యంగా కనిపిస్తోంది. మరి హైదరాబాద్‌లో కాంగ్రెస్ నిర్వహించనున్న భారీ సభకు జాతీయ స్థాయి నేతలు హాజరవుతారా? రెండు లక్షల మందిని సమీకరించాలన్న లక్ష్యం నెరవేరుతుందా? సర్ అంశంపై దక్షిణాదిలో కాంగ్రెస్ చేపట్టనున్న పోరాటం జాతీయ రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపనుంది? అన్నది ఆసక్తికరంగా మారింది.

# కనకదుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పణ

చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. సీఎం పట్టువస్త్రాలు సమర్పించే సమయంలోనూ సామాన్య భక్తుల దర్శనాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా క్యూ లైన్లను కొనసాగించారు. పూజల అనంతరం ఆశీర్వచన మండపంలో అర్చకులు సీఎం దంపతులకు వేదాశీస్సులు అందజేశారు. ఈవో శీనానాయక్ అమ్మవారి శేషవస్త్రాలను అందించగా, ఆలయ చైర్మన్, ఈవో అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

### 6 రోజుల్లో 8 లక్షల మంది భక్తుల దర్శనం

'రాష్ట్ర ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు. ప్రభుత్వం తరపున కుటుంబ సమేతంగా అమ్మవారికి చీర, సారె సమర్పించి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించాను. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ పాలక మండలి, అధికారులు ఏర్పాట్లు చేశారు'అని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు.

'ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. ఆరు రోజుల్లోనే ఎనిమిది లక్షల మంది అమ్మవారిని దర్శించుకున్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు భక్తిశ్రద్ధలతో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందుతున్నారు. విజయవాడ ఉత్సవ్ 2.0, జాతీయ సరస్ మేళా కూడా ఇక్కడే జరుగుతున్నాయి. దేశంలో ప్రముఖంగా నిర్వహించే ఉత్సవాల్లో విజయవాడ దసరా ఉత్సవాలు చోటు సంపాదించుకోవడం శుభపరిణామం. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించాను. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని ఆకాంక్షించాను. ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్యకరమైన, సంపన్నమైన, సంతోషకరమైన సమాజంగా తీర్చిదిద్దాలని అమ్మవారిని కోరుకున్నాను' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

# ఇది కాంగ్రెస్ చేతగానితనం వల్ల వచ్చిన కరవు

నీటిని వృథాగా దిగువకు వదిలేశారని మండిపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

### 1,000 టీఎంసీల నీరు వృథా చేశారంటూ..

ఈ ఏడాది జూన్ 1 నుంచి ఇప్పటివరకు 750 టీఎంసీలకు పైగా గోదావరి నీటిని, 250 టీఎంసీల కృష్ణా జలాలను సముద్రంలోకి, దిగువ ప్రాంతాలకు వదిలేశారని కేటీఆర్ పేర్కొన్నారు. కన్నెపల్లి, దేవాదుల పంపులను సక్రమంగా నిర్వహించి వినియోగించుకుని ఉంటే గోదావరి పరివాహక ప్రాంతంలోని రిజర్వాయర్లు, చెరువులు నిండేవని అన్నారు. కానీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కృష్ణా జలాలను వినియోగించుకునేందుకు వీలున్న పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల పంపులను ఆన్ చేయకుండా నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. ప్రాజెక్టుల ద్వారా నీటిని ఎత్తిపోసి నిల్వ చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని ధ్వజమెత్తారు.

### ఎల్‌నినో హెచ్చరికలున్నా ముందస్తు చర్యలు లేవు

ఎల్‌నినో ప్రభావం ఉండవచ్చని మార్చి నుంచే వాతావరణ నిపుణులు హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించలేదని కేటీఆర్ ఆరోపించారు. నీటి లభ్యతపై ముందుగానే అంచనాలు వేసి, సాగు, తాగునీటి అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సిందని అన్నారు. మరోవైపు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను తరలించుకెళ్లిందని కేటీఆర్ పేర్కొన్నారు.

పోతిరెడ్డిపాడు, వెలిగొండ సొరంగం ద్వారా కృష్ణా జలాలను వినియోగించుకుందని, కుప్పం ప్రాంతానికి కూడా నీటిని అందించిందని అన్నారు. తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటాను కాపాడుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.రాష్ట్రంలో నీటి ఎద్దడి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రాజెక్టుల నిర్వహణ, నీటి నిల్వలు, సాగు, తాగునీటి అవసరాలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి పెట్టాలని కేటీఆర్ వ్యాఖ్యల సారాంశం. అయితే, నీటి విడుదలకు సంబంధించిన గణాంకాలు, ప్రభుత్వ నిర్లక్ష్యంపై చేసిన ఆరోపణలు కేటీఆర్ వెల్లడించినవే.

# జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా

**-ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి**



కాప్రా (ప్రశ్న న్యూస్ )ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా జర్నలిస్టులకు ప్రమాదభీమా బాండ్ల పంపిణీ,జర్నలిస్టులకు ఎల్లప్పుడూ తమ సహాయ సహకారాలు అందిస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం సైనిక్ పురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ కాప్రా డివిజన్ ప్రెసిడెంట్ భైరి నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో కాప్రా ప్రెస్ క్లబ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు 60 లక్షల ప్రమాద భీమా పాలసీలు చేయించి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా జర్నలిస్టులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులందరూ ఐక్యంగా ఉండాలన్నారు. అన్ని విధాలుగా తమ సహాయ సహకారాలు అందిస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జర్నలిస్టులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నేమూరి మహేష్ గౌడ్,బీ ఆర్ ఎస్ కార్యకర్తలు,కాప్రా ప్రెస్ క్లబ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## తూప్రాన్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంలో

**- మెదక్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి,**

**- మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) తూప్రాన్ ప్రాథమిక వ్యవసాయ సంఘం నూతన పాలకవర్గం రమణ స్వీకరంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ ఉమ్మన్నగారి భాస్కర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం నూతన పాలకవర్గం సమన్వయంతో పనిచేసి రైతులకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే అందరి లక్ష్యమని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రజా పాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. ఈ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేయాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మహిపాల్ రెడ్డి, తూప్రాన్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు నర్సింగా రావు, మనోహరాబాద్ మండల అధ్యక్షులు మల్లారెడ్డి, సీనియర్ నాయకులు, సర్పంచులు, అనుబంధ సంఘాల నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**- సంప్రదాయబద్ధంగా బతుకమ్మ సంబరాలు.. ఉత్సాహంగా పాల్గొన్న పోలీసు కుటుంబాలు**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ముఖ్య అతిథిగా హాజరై బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంబరాలు చేసుకున్నారు.తెలంగాణ ప్రకృతి అందాలు, ఆచార సంప్రదాయాలు ఉట్టిపడేలా వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. పోలీసు కుటుంబ సభ్యుల ఆటపాటలు, సందడితో జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు, పోలీసు కుటుంబాల మధ్య ఆత్మీయత, ఐక్యతను పెంపొందించే ఉద్దేశంతో ఈ వేడుకలను నిర్వహించారు. విధి నిర్వహణలో నిరంతరం నిమగ్నమయ్యే పోలీసు సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో కలిసి ఒకచోట చేరి ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ పండుగను జరుపుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ వేడుకలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్నిచాటిచెప్పడంతో పాటు పోలీసు కుటుంబాల్లో ఆనందోత్సాహాలను నింపాయి.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్, డియస్పి ప్రసన్న కుమార్, సీఐ లు సందీప్ రెడ్డి, జర్జ్, కృష్ణ మూర్తి, శైలందర్, రామ కృష్ణ, మహిళా సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# జాదు సే జాదవ్ బనగైయా సుధాకర్ జీ

**- నకిలీ యూఎల్సీ క్లియరెన్స్ లేఖలతో ఆస్తుల రిజిస్ట్రేషన్లు**

**- ముగ్గురు నిందితుల అరెస్టు**





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ జంటనగరాల్లో స్థలం కొనుగోలు చేస్తున్నారా, ఇక మీకు కావలసిన వివిధ రకాల ఎన్‌ఓసిలు. ఉదాహరణకు:యూఎల్సీ, ఎల్ఆర్ఎస్, నాల కన్వెన్షన్, హెచ్ఎండిఏ, ఇరిగేషన్, రెవెన్యూ సర్వే ధృవ పత్రాలు అవసరం తప్పనిసరి. ఇదే అదునుగా కేటుగాళ్లు అమాయకులను టోకర వేస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. పాపం అభం శుభం తెలియని ప్రజలు ఇలాంటి దొంగల చేతిలో మోసపోతున్నారు. ఈ నేపథ్యంలో సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నకిలీ అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్సీ) క్లియరెన్స్ ధృవ పత్రాలను సమర్పించి, వాటి ఆధారంగా ఆస్తుల రిజిస్ట్రేషన్లు చేయించిన కేసులో ముగ్గురు నిందితులను సూరారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించి క్రైం నెంబర్: 616/2026 యూ/ఎస్ 318(4),338, 336(3),337, 340(2) రెడ్ /విత్ 3(5), 61(2) బిఎన్ఎస్ సెక్షన్ 82 ఆఫ్ ది రిజిస్ట్రేషన్ యాక్ట్, 1908 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు సూరారం పోలీసులు.

ఈనెల 24-08-2026న కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి చెందిన జూనియర్ సబ్‌రిజిస్ట్రార్-I పి.మధు బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది.జీడిమెట్ల గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 192,193లో ఉన్న ప్లాట్లకు సంబంధించి,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్,అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎస్సీ) అధికారి జారీ చేసినట్లుగా రెండు క్లియరెన్స్ లేఖలను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సమర్పించారు.వాటిని పరిశీలించగా,సంబంధిత అధికారులచే జారీ చేయబడిన అసలైన ప్రభుత్వ పత్రాలు కావని గుర్తించిన సబ్ రిజిస్ట్రార్.ఈ నకిలీ పత్రాల ఆధారంగా 04-06-2026న రెండు సేల్ డీడ్లు రిజిస్ట్రేషన్ చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. అలాగే ఈ దర్యాప్తులో సేకరించిన పత్రాలు,సాక్షుల వాంగ్మూలాలు ఇతర ఆధారాల ఆధారంగా, అర్బన్ ల్యాండ్ సీలింగ్ క్లియరెన్స్ పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆస్తి యజమానులకు క్లియరెన్స్ లేఖలు ఇప్పిస్తామని నమ్మించి,నకిలీ పత్రాలను తయారు చేసి అందించినట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. దర్యాప్తు ప్రకారం, నిందితులు పరస్పర సమన్వయంతో వ్యవహరిస్తూ,జీడిమెట్ల గ్రామంలోని ప్లాట్లకు సంబంధించి జీ/ఏ6/191/2026 జీ/ఏ6/192/2026 నంబర్లతో, 22-04-2026 తేదీతో ఉన్నట్లుగా చూపించిన రెండు నకిలీ యూఎల్సీ క్లియరెన్స్ లేఖలను రూ.6,00,000 తీసుకొని తయారు చేసి అందించినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఈ పత్రాల ఆధారంగా సంబంధిత ఆస్తులకు రెండు సేల్ డీడ్లు రిజిస్ట్రేషన్ చేయబడ్డాయి.

### నిందితుల వివరాలు వారి పాత్ర:

1. జాదవ్ సుధాకర్, తండ్రి:హనుమంతరావు జాదవ్,వయస్సు:39 సంవత్సరాలు,వృత్తి: సాఫ్ట్‌వేర్ ఉద్యోగి / రియల్ ఎస్టేట్ ఏజెంట్,నివాసం: సుభాష్ నగర్ కాలనీ, ఐడీఏ జీడిమెట్ల, కుత్బుల్లాపూర్ మండలం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా. నకిలీ యూఎల్సీ క్లియరెన్స్ లేఖలను తయారు చేయించడంలో దిట్ట,ఇతర నిందితులకు అందించడంలో ఈ వ్యవహారంలో డబ్బు పొందడంలో పాత్ర ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.
2. నారాయణదాసు శివాచారి అలియాస్ శివ తండ్రి:స్వర్గీయ భీమయ్య, వయస్సు:57 సంవత్సరాలు, వృత్తి: స్వయం ఉపాధి,నివాసం: ప్యారడైజ్ ఫంక్షన్ హాల్ ఎదురుగా,హెచ్ఏఎల్ కాలనీ,కుత్బుల్లాపూర్ మండలం,మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా. స్వగ్రామం: చీమలగుంటపల్లి గ్రామం, వనపర్తి మండలం జిల్లా మహబూబ్ నగర్. ప్రభుత్వ అధికారుల సంతకాలు,ముద్రలను అనుకరిస్తూ నకిలీ యూఎల్సీ క్లియరెన్స్ లేఖలను తయారు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. 3. చిట్టిమిల్ల బాలరాం తండ్రి:స్వర్గీయ విట్టల్, వయస్సు:64 సంవత్సరాలు,వృత్తి: రియల్ ఎస్టేట్ వ్యాపారం, నివాసం:దుర్గా ఎస్టేట్, సుచిత్ర,పేట్-బషీరాబాద్, కుత్బుల్లాపూర్ మండలం, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా. ఆస్తి యజమానులకు యూఎల్సీ క్లియరెన్స్ లేఖలు ఇప్పిస్తానని నమ్మించి,సంబంధిత లావాదేవీలను సమన్వయం చేయడం డబ్బు వసూలు చేయడంలో పాత్ర ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

### నిందితుల నుంచి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు:

1. నకిలీ యూఎల్సీ క్లియరెన్స్ లేఖలకు సంబంధించిన పదిహేడు పత్రాలు.
2. యూఎల్సీ అధికారిక ముద్రలుగా చూపించే రబ్బరు స్టాంపులు ఇతర స్టాంపులు - 5
3. స్టాంప్ ప్యాడ్లు - 5
4. గ్రీన్ పెన్ -1
5. ఇతర నకిలీ క్లియరెన్స్ లేఖలకు సంబంధించిన పత్రాలు
6. మొబైల్ ఫోన్లు - 3

స్వాధీనం చేసుకున్న పత్రాలు,మొబైల్ ఫోన్లు ఇతర వస్తువులను తదుపరి దర్యాప్తులో భాగంగా పరిశీలిస్తున్నారు.

ఈ వ్యవహారంలో మరెవరైనా ఉన్నారా,ఇదే విధంగా నకిలీ యూఎల్సీ క్లియరెన్స్ లేఖల ఆధారంగా మరెన్ని ఆస్తుల రిజిస్ట్రేషన్లు జరిగాయా అనే కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేస్తున్న పోలీసులు. కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ ఎన్.కోటి రెడ్డి,అడిషనల్ డీసీపీ పురుషోత్తం, కుత్బుల్లాపూర్ డివిజన్ ఏసీపీ ఏ.సి. బాల గంగి రెడ్డి ఆధ్వర్యంలో ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసులో సమర్థవంతంగా విధులు నిర్వహించిన సూరారం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ కే.బాలరాజు, ఎస్సై ఏ.కృష్ణ,ఏఎస్సై శ్రీనివాస్,హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున్,ఉమెన్ కానిస్టేబుల్ రాధ తదితరులను ఉన్నతాధికారులు అభినందించారు.

## ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



**నాచారం(ప్రశ్న న్యూస్)** కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ సైనికుడు మామిడాల సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం లో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల లో భాగంగా సరస్వతీ దేవి పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మందుముల పరమేశ్వర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో రఘుపతిరెడ్డి, నూతలకంటి రాజు, హెచ్.ఆర్. మోహన్, బండారం శ్రీకాంత్ గౌడ్, ప్రకాష్‌రెడ్డి, అశ్వర్థామరెడ్డి, మహేష్ యాదవ్, సునీల్‌రెడ్డి, గడ్డ క్రాంతి కిషోర్, రఘు, నిఖిల్ సాయి, రాజశేఖర్, బలరాజ్, సుజాత, భారతి, జాఫర్, సాయి చరణ్, రేవంత్, మజ్జిగ జోషిత్ యాదవ్, ఎస్ఎస్ఎస్ యువసేన సభ్యులు మధు ముదిరాజ్, అరెల్ల శ్రీధర్, సాయి చంద్, కర్ణాకర్, అక్షత్ పడాల, అలేటి గణేష్, శివ, అనిల్‌రెడ్డి, రాజ్‌కుమార్, కార్తీక్, నర్సింహా, కిరణ్, శంకర్, దిలీప్,తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంక్ ఆఫ్ ఇండియా మెదక్ శాఖ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన కార్యక్రమం

**- అవినీతిపై పోరాటమే విజిలెన్స్ లక్ష్యం.**





మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్) మెదక్ మున్సిపల్ పరిధిలోని ఒకటవ వార్డు (ఔరంగాబాద్ )లో బ్యాంక్ ఆఫ్ ఇండియా మెదక్ శాఖ ఆధ్వర్యంలో గ్రామంలో విజిలెన్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు గ్రామస్తులకు అవినీతి నిరోధక చట్టాలు, విజిలెన్స్ ప్రాధాన్యం, పారదర్శకత, నైతిక విలువలపై వివరించారు. గ్రామ ప్రజలు గ్రామ ప్రజలు ఎలాంటి అవినీతి చర్యలకు పాల్పడకూడదని, ప్రభుత్వ భూములను ప్రభుత్వ పథకాలు బ్యాంకింగ్ సేవలును వినియోగం సెలవు చేసుకోవాలని సూచించారు విజిలెన్స్ ద్వారా పారదర్శకత వ్యవస్థను బలపరచడం అవినీతి నిర్మించడం సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా మెదక్ శాఖ ప్రధాన అధికారులు గ్రామస్తులతో మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు విజిలెన్స్ పై అవగాహన ప్రజల లక్ష్యమని ప్రతి ఒక్కరు అవినీతిపై వ్యతిరేకంగా కలిసి పని చేయాలని పేర్కొన్నారు.

## గొల్లపల్లి రిజర్వాయర్‌లో మునిగి ఐదుగురు మహిళల మృతి!

**శ్రీ సత్యసాయి** జిల్లాలో శుక్రవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. పెనుకొండ నియోజకవర్గంలోని గొల్లపల్లి రిజర్వాయర్‌లో ఐదుగురు మహిళలు మునిగి మృతి చెందినట్లు సమాచారం.మృతులు పెనుకొండకు చెందిన వారుగా తెలుస్తోంది. సరదాగా గడపడానికి వెళ్లిన మహిళలు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం.ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## జోగులాంబ అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణలో మంత్రి వాకిటి శ్రీహరి తో కలిసి పాల్గొన్న వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి.

**వనపర్తి.** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అలంపూర్‌లో ప్రత్యేక పూజలు.అలంపూర్ శ్రీ బాలబ్రహ్మేశ్వర స్వామి, శ్రీ జోగులాంబ అమ్మవార్లకు దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి , ఏఐసీసీ కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్ మంత్రితో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ పూజారులు, కార్యనిర్వహణాధికారి దీప్తి పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలికారు.అనంతరం శ్రీ బాలబ్రహ్మేశ్వర స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, శ్రీ జోగులాంబ అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు.వేదమంత్రాల నడుమ స్వామివారి, అమ్మవారి ఆశీర్వచనాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి , వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్ , తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ చైర్మన్ సరిత తిరుపతయ్య , ఆలయ అధికారులు, అదనపు కలెక్టర్లు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హిటాచి యంత్రం కిందపడి వ్యక్తి అక్కడికక్కడే మృతి

**చిట్వేలి** చిట్వేలి ప్రాథమిక ఆసుపత్రి సమీపంలో గురుగుపల్లి రోడ్డు నందు హిటాచి యంత్రం కిందపడి వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. చిట్వేలి మండలం దొగ్గలపాడు గ్రామానికి చెందిన ముద్రి యానాదయ్య శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో హిటాచి యంత్రం మీద ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడి పై హిటాచి యంత్రం వెళ్లడంతో మృతుడి ని గుర్తు పట్టలేనంతగా తల, ఎద భాగం పూర్తిగా నుజ్జు నుజ్జు అయ్యాయి. సమాచారం అందుకున్న చిట్వేలి పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ సంఘటన స్థలంలో ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీనివాసపురం కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**- రాజకీయాలకు అతీతంగా కాలనీ సంక్షేమానికి కృషి చేస్తాం: అధ్యక్షుడు గాదె సత్యనారాయణ**





**ఉప్పల్ (ప్రశ్న న్యూస్)** వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ శ్రీనివాసపురం కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని సంఘం చైర్మన్ కంది అగిరెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, కాలనీవాసుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా నూతన కార్యవర్గం పనిచేయనుంది.సంఘం నూతన అధ్యక్షుడు గాదె సత్యనారాయణమాట్లాడుతూ తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న శ్రీనివాసపురం కాలనీవాసులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా కాలనీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సమయంలో మంచినీరు, విద్యుత్, డ్రైనేజీ, పారిశుద్ధ్యం తదితర సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసినట్లు తెలిపారు.గత 25 సంవత్సరాలుగా కాలనీ అభివృద్ధికి సహకరిస్తున్న కాలనీవాసులు తనను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం సంతోషంగా ఉందని అన్నారు.తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

# తప్ప తాగి ఆడపిల్లకు టక్కర చేస్తావా

**– తాగింది దిగేదాకా తన్ని పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు**



ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) వెంకటాపూర్ బైపాస్ రోడ్డులోని మూలమలుపు వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్కూటీపై వెళ్తున్న యువతిని వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి యువతిని ఆసుపత్రికి తరలించేందుకు సహాయపడ్డారు.

**సిరిసిల్ల నుంచి తిరిగి వస్తుండగా ప్రమాదం.** స్థానికుల కథనం ప్రకారం. వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి సీతారాం తండాకు చెందిన భూక్య గౌతమి సిరిసిల్లలో బోరు మోటారు మరమ్మతు చేయించుకుని స్కూటీపై వెంకటాపూర్ బైపాస్ రోడ్డు మీదుగా స్వగ్రామానికి తిరిగి వెళ్తోంది. ఈ క్రమంలో వెంకటాపూర్ మూలమలుపు వద్దకు చేరుకోగానే నారాయణపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నడుపుతున్న కారు వెనుక నుంచి వచ్చి స్కూటీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భూక్య గౌతమికి తలకు తీవ్ర గాయాలయ్యాయి.

**తప్ప తాగి ఆడపిల్లకు టక్కర చేస్తావా** ప్రమాదం జరిగిన వెంటనే అక్కడికి చేరుకున్న స్థానికులు కారు నడుపుతున్న వ్యక్తి తప్ప తాగి మత్తులో ఉన్నాడని, అతివేగమే ప్రమాదానికి కారణమని ఆరోపించారు. బైపాస్ రహదారులపై మూలమలుపుల వద్ద వాహనాలను అతివేగంగా నడపడం ప్రమాదాలకు దారితీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, డ్రైవర్‌తప్ప తాగి ఆడపిల్లకు టక్కర చేశాడని ఆరోపిస్తూ, తాగింది దిగేదాకా తంతం అంటూ, తన్నేవాళ్ళు తన్ని కొట్టే వాళ్ళు కొట్టి పోలీసులకు అప్పగించారు.

**తాగి వాహనాలు నడపద్దని పోలీస్ మర్యాదలతో చెప్పిన పోలీసులు** తాగి ప్రమాదానికి కారణమైన డ్రైవర్ను పోలీసులు అదుపులోకి తీసుకొని మర్యాదపూర్వకంగా మరోసారి తాగి ఇలాంటి ప్రమాదాలు చేయొద్దు అని, నీ తాగడం కారణంగా అన్యాయంగా ఓ అమ్మాయి చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుందని, తప్ప తాగి మరోసారి అతివేగంగా ప్రయాణించి అమాయకుల ప్రాణాలు తీయద్దు అని పోలీసులు మర్యాదపూర్వకంగా చెప్పినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

**సమయానికి అందని 108 అంబులెన్స్.** ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువతిని ఆసుపత్రికి తరలించేందుకు స్థానికులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసినప్పటికీ, అది అందుబాటులోకి రాలేదని సమాచారం. దీంతో అక్కడే విధుల్లో ఉన్న ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ దేవరాజు వెంటనే స్పందించారు. ఓ ప్రవేట్ వాహనంలో గాయపడిన యువతిని సిరిసిల్ల ఆసుపత్రికి తరలించేందుకు సహకరించినట్లు తెలిసింది. ప్రమాద సమయంలో వేగంగా స్పందించి బాధితురాలిని ఆసుపత్రికి తరలించడంలో సహకరించిన స్థానికులు మధు, హెడ్ కానిస్టేబుల్ దేవరాజుపై స్థానికులు అభినందనలు వ్యక్తం చేశారు. అదే సమయంలో అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**తప్ప తాగి వాహనాలు నడిపే వాళ్ళు జాగ్రత్త** వెంకటాపూర్ బైపాస్ మూలమలుపు వద్ద తప్ప తాగి న వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, వేగ నియంత్రణ పాటించాలని స్థానికులు తెలియజేస్తున్నారు. లేనియెడల తాగింది దిగేదాకా తన్ని పోలీసులకు అప్పగించడం జరుగుతుందని హెచ్చరిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు, బాధ్యులపై తీసుకునే చర్యలపై అధికారిక సమాచారం తెలియాల్సి ఉంది.

## తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం

# అధ్యక్షురాలుగా లక్కం రాజ్యలక్ష్మి

**– హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఆఫ్ ఇండియా**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లోని సంస్థ జాతీయ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు, జాతీయ చైర్మన్ మహమ్మద్ తక్దీర్ అలీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కమిటీని ప్రకటించారు. ఇందులో భాగంగా లక్కం రాజ్యలక్ష్మి గారిని తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా ప్రకటించారు. ఈ సందర్భంగా లక్కంరాజు లక్ష్మి మాట్లాడుతూ నేటి సమాజంలో చాలామంది సామాన్య ప్రజలు తమ హక్కులపై పూర్తి అవగాహన లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తమకు ఎదురవుతున్న సమస్యను గుర్తించలేని పరిస్థితితో పాటు, సమస్యను ఎవరికి తెలియజేయాలి, పరిష్కారం కోసం ఎవరిని సంప్రదించాలి అనే విషయాలపై అవగాహన లేని ప్రజలు ఎంతోమంది ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ నేషనల్ జనరల్ సెక్రెటరీ సన, నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ రమ్యశ్రీ, వివిధ జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పెద్దపల్లి అధ్యక్షులు కొమ్ము ఓదెలు జిల్లా జనరల్ సెక్రటరీ గడ్డం సత్యనారాయణ, మీడియా సెక్రటరీ బోయిని ప్రసాద్,జాయింట్ సెక్రటరీ గీట్ల మధు గారు తదితరులు పాల్గొన్నారు.

## శాంతినగర్ కాలనీలో అంగరంగ వైభవంగా

# బతుకమ్మ సంబరాలు

**– మహిళల ఆటపాటలతో మార్మోగిన కాలనీ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా వేడుకలు**



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** మేడ్చల్ నగరంలోని శాంతినగర్ కాలనీలో బతుకమ్మ ఉత్సవాలు అంగరంగ వైభవంగా, అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ చేరి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. మహిళల కోలాటాలు, జానపద గీతాలతో కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు, పూల గొప్పతనానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను తరతరాలుగా వస్తున్న ఆచార సంప్రదాయాలను కొనసాగిస్తూ నిర్వహించుకోవడం విశేషం. ఇటువంటి వేడుకలు మహిళల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు దోహదపడతాయని పలువురు పేర్కొన్నారు. శాంతినగర్ కాలనీలో బతుకమ్మ సంబరాలు ఉత్సాహంగా సాగడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. పండుగ వేడుకలతో కాలనీలో సందడి నెలకొంది.

# నవరాత్రుల ఏడో రోజు.. కాళరాత్రి అమ్మవారి అవతారం విశిష్టత

**– దుష్టశక్తుల పాలిట మహాకాళి.. భక్తులకు అభయమిచ్చే ఆదిశక్తి**

**– చీకటిని తొలగించి ధర్మాన్ని కాపాడే ఉగ్రరూపిణి.. భయాన్ని జయించే శక్తికి ప్రతీక**

(ప్రశ్న న్యూస్ ప్రత్యేక కథనం మేడ్చల్ ప్రతినిధి చిన్న )



నవరాత్రి ఉత్సవాల్లో ఏడో రోజుకు ఎంతో ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది. నవదుర్గలలో ఏడో రూపమైన కాళరాత్రి అమ్మవారిని ఈ రోజున భక్తులు భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారు. చూడటానికి ఉగ్రరూపంలో కనిపించినా, భక్తుల పట్ల అపారమైన కరుణను చూపించే తల్లిగా కాళరాత్రి దేవిని కొలుస్తారు. దుష్టశక్తులను సంహరించి ధర్మాన్ని కాపాడే శక్తిస్వరూపిణిగా, భయాలను తొలగించి ధైర్యాన్ని ప్రసాదించే జగన్మాతగా ఆమెకు విశిష్ట స్థానం ఉంది.

### కాళరాత్రి అనే పేరు వెనుక అర్థం ఏమిటి?

'కాళ' అంటే కాలం లేదా అంధకారాన్ని సూచించే పదంగా, 'రాత్రి' అంటే చీకటిని సూచించే పదంగా భావిస్తారు. అజ్ఞానం, భయం, దుష్టశక్తులు, అధర్మం వంటి చీకట్లను తొలగించే దైవశక్తికి కాళరాత్రి రూపం ప్రతీకగా నిలుస్తుంది. అమ్మవారి రూపం ఉగ్రంగా ఉన్నప్పటికీ, ఆమెను శుభంకరమైన తల్లిగా కూడా ఆరాధిస్తారు. అందుకే కాళరాత్రి దేవిని 'శుభంకరి' అని పిలుస్తారు. భక్తుల జీవితాల్లోని భయాలు తొలగించి శుభాన్ని కలిగించే తల్లిగా ఆమెను విశ్వసిస్తారు.

### అమ్మవారి దివ్యరూపం.. విశిష్టత

కాళరాత్రి అమ్మవారు నల్లని శరీరఛాయతో, విరబోసిన జుట్టుతో, మెరుపుల్లాంటి కాంతిని వెదజల్లే రూపంతో దర్శనమిస్తారు. గాడిదపై ఆసీనురాలిగా చిత్రించబడే ఈమెకు నాలుగు చేతులు ఉంటాయి. రెండు చేతుల్లో ఆయుధాలను ధరించి, మరో రెండు చేతులతో అభయముద్ర, వరదముద్రలను ప్రదర్శిస్తారు. అమ్మవారి ఉగ్రరూపం చెడుపై పోరాటానికి, అధర్మ నిర్మూలనకు సంకేతం. ఆమె అభయముద్ర భక్తులకు భరోసాను కల్పిస్తే, వరదముద్ర కరుణను, అనుగ్రహాన్ని సూచిస్తుంది. రూపం భయంకరంగా కనిపించినా, తనను నమ్మి ఆశ్రయించినవారిని కాపాడే దయామయి అనే భావన ఈ అవతారంలో అంతర్లీనంగా ఉంటుంది.

### పురాణ గాథలో కాళరాత్రి అమ్మవారి ప్రాధాన్యత

హిందూ పురాణ సంప్రదాయాల్లో కాళరాత్రి దేవిని దుష్టశక్తులను అణచివేసే మహాశక్తిగా వర్ణిస్తారు. లోకాలను భయభ్రాంతులకు గురిచేసే దుష్టశక్తుల నుంచి దేవతలను, సజ్జనులను రక్షించేందుకు అమ్మవారు ఉగ్రరూపాన్ని ధరించినట్లు కథనాలు చెబుతాయి.

ఈ అవతారం ద్వారా చెడును ఎదుర్కోవడానికి కొన్నిసార్లు కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని, ధర్మాన్ని కాపాడేందుకు ధైర్యంగా నిలబడాలని సందేశం లభిస్తుంది. అయితే అమ్మవారి ఉగ్రత్వం ద్వేషానికి ప్రతీక కాదు.. అధర్మాన్ని అణచి, సజ్జనులకు రక్షణ కల్పించే దైవశక్తికి ప్రతీకగా భావిస్తారు.

### ఏడో రోజు పూజల విశిష్టత

నవరాత్రుల ఏడో రోజున భక్తులు కాళరాత్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దీపారాధన, పుష్పార్చన, నైవేద్య సమర్పణతో పాటు అమ్మవారి నామస్మరణ, మంత్రపఠనం, ధ్యానం చేస్తారు. కుటుంబ సభ్యుల క్షేమం, ఆరోగ్యం, శాంతి, సౌభాగ్యం కోసం ప్రార్థిస్తారు. కాళరాత్రి అమ్మవారిని ఆరాధించడం వల్ల భయం తొలగి, ధైర్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని భక్తుల విశ్వాసం. పూజా విధానాలు, నైవేద్యాలు ప్రాంతీయ సంప్రదాయాలను బట్టి మారవచ్చు.

### నేటి సమాజానికి అమ్మవారి సందేశం

కాళరాత్రి అమ్మవారి అవతారం నేటి సమాజానికి కూడా ఎంతో స్ఫూర్తిదాయకం. జీవితంలో ఎదురయ్యే కష్టాలు, సమస్యలు, భయాలను చూసి వెనుకడుగు వేయకూడదు. ధైర్యంగా వాటిని ఎదుర్కొంటూ సరైన మార్గంలో ముందుకు సాగాలి. సమాజంలో అన్యాయం, వేధింపులు, దురాచారాలు కనిపించినప్పుడు మౌనంగా ఉండకుండా వాటిని ప్రశ్నించాలి. బలహీనులకు అండగా నిలవాలి. మనలోని కోపం, అసూయ, ద్వేషం, అహంకారం వంటి ప్రతికూల భావాలను జయించాలి. నిజమైన విజయం ఇతరులను ఓడించడంలోనే కాదు.. మనలోని చెడు లక్షణాలను అధిగమించడంలో కూడా ఉందని ఈ అవతారం గుర్తుచేస్తుంది.

### భయాన్ని తొలగించి శుభాన్ని ప్రసాదించే తల్లి

నవరాత్రుల ఏడో రోజున కాళరాత్రి అమ్మవారిని ఆరాధించడం ద్వారా భక్తులు తమ జీవితాల్లోని చీకట్లు తొలగి, వెలుగు నిండాలని కోరుకుంటారు. ఆమె ఉగ్రరూపం ధైర్యానికి, అభయముద్ర రక్షణకు, దివ్యస్వరూపం ధర్మవిజయానికి ప్రతీకగా నిలుస్తాయి.

# భావితరాలకు ఔషధ వారధి రామగిరి ఖిల్లా

# అపురూప వనమూలికల స్వర్గధామం

**– చారిత్రక, ప్రాకృతిక వృక్ష సంపదను రక్షించుకోవాల్సిన తక్షణ ఆవశ్యకత**





తెలంగాణ గుండెకాయ పెద్దపల్లి జిల్లాలో గగనాన తలెత్తుకుని నిలబడిన రామగిరి ఖిల్లా కేవలం శిలాసంపద కాదు. అది చరిత్రకు, ఆధ్యాత్మికతకు, ప్రకృతి సౌందర్యానికి సజీవ సాక్ష్యం. తెలంగాణ రాష్ట్రావనికే ఒక కలికితురాయిలా, ప్రాకృతిక దిక్సూచికి చుక్కానిలా నిలుస్తున్న అద్భుత ప్రదేశం ఇది. త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు అడుగుపెట్టిన 'చిత్రకూట' పర్వతంగా దీనికి అపారమైన ఆధ్యాత్మిక నేపథ్యం ఉంది. ఎందరో రాజుల వీరత్వానికి ప్రతీకగా నిలిచిన ఈ కోట ప్రాకారాల వెనుక, కనులవిందు చేసే ప్రకృతి రమణీయతతో పాటు అమృతతుల్యమైన అపార ఔషధ వృక్ష సంపద దాగి ఉంది. ప్రాణాలను నిలబెట్టే ఎన్నో అరుదైన వృక్ష జాతులు ఈ రామగిరి అడవుల్లో నిశ్శబ్దంగా అంతరించిపోతున్నాయి. ముఖ్యంగా అత్యంత అరుదైన పసుపు పచ్చ మోదుగ, తెల్ల మోదుగ, మహా ఔషధాలైన బలాచతుష్టయము, ఎర్ర చిత్రమూలము, నల్ల చిత్రమూలము, నల్ల పసుపు, విజయసార, అర్జున, పొనికి వంటి అపురూపమైన వనమూలికలు ఇక్కడ ప్రాణం పోసుకున్నాయి. వీటికి తోడు అపారమైన ఔషధ గుణాలున్న బోడతరిగె, అక్కలకర్ర, అశ్వగంధ, నేల గుమ్మడి, శతావరి లాంటి ఎన్నో మొక్కలు స్వార్థానికి, నిర్లక్ష్యానికి బలవుతున్నాయి. ఈ అమృత తుల్యమైన మొక్కలను తక్షణమే రక్షించుకోకపోతే భవిష్యత్తులో వీటిని కేవలం కాగితాల మీద మాత్రమే వెతుక్కోవాల్సిన దయనీయ పరిస్థితి వస్తుంది. నేటి తరానికి కనీసం ఈ మూలికల పేర్లు, వాటి ఆకారాలు కూడా తెలియని దుస్థితి నెలకొంది. ఈ విపత్కర పరిస్థితుల్లో రామగిరి ఖిల్లాను పర్యాటక కేంద్రంగా మాత్రమే చూడకుండా, భావితరాలకు ఒక ఔషధ వారధిగా, ఒక "సజీవ వనమూలికా క్షేత్రం" (సజీవ ప్రదర్శనశాల) గా తీర్చిదిద్దాలి. అటవీ అధికారుల అనుమతి లేకుండా ఇక్కడి నుండి ఒక్క ఆకు కూడా బయటకు వెళ్లకూడదనే కఠిన నిబంధనలు అమలు కావాలి. రామగిరి ఖిల్లా ప్రకృతి రమణీయతకు, సౌందర్యానికి చిరునామాగానే కాక, ఆరోగ్యకరమైన భావితరాలకు స్వర్గధామంగా నిలవాలి. రాష్ట్రవ్యాప్తంగా అంతరించిపోతున్న మరో వేయి అరుదైన మొక్కలను ఇక్కడ నాటి, ప్రతి మొక్కకూ దాని శాస్త్రీయ నామం, ఆయుర్వేద ఉపయోగాలు తెలిపేలా ఆధునిక సాంకేతికతతో గుర్తింపు ఏర్పాటు చేయాలి. ప్రకృతిని మనం రక్షిస్తే, ఆ ప్రకృతి తన ఔషధాలతో మనల్ని రక్షిస్తుంది. దశాబ్దాలుగా ప్రకృతితో మమేకమై, పట్టుదలతో ఔషధ వృక్షాల సంరక్షణే శ్వాసగా బతుకుతున్న ఒక అనువంశిక పరంపర వైద్యుడిగా నా సంకల్పం ఒక్కటే. రామగిరి అటవీ సంపదను కంటికి రెప్పలా కాపాడుకుందాం. భావితరాలకు ప్రాకృతిక, ఆరోగ్యకరమైన తెలంగాణను అందిద్దాం



**సింహాచలం లక్ష్మణస్వామి,**
**వ్యవస్థాపక అధ్యక్షులు,**
**ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహా సంఘం**
**(రిజిస్టర్డ్ నంబర్: 979/2025).**
**సెల్ నంబర్: 90001 87858**

# రూ.20 వేల అప్పు కోసం యువకుడి దారుణ హత్య

**– ఇద్దరు నిందితులు అరెస్ట్**

**– బీరు తాగుదామని పిలిచి కత్తితో దాడి**

**– ఫ్యూచర్ సిటీ పోలీసుల దర్యాప్తుతో చిక్కిన నిందితులు.. రూ.20 వేల అప్పే కారణం**

**– మీడియా సమావేశంలో షాద్ నగర్ ఎసిపి లక్ష్మీనారాయణ వెల్లడి**





**షాద్ నగర్ (ప్రశ్న న్యూస్)** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ కొత్తూరు తిగాపూర్ గ్రామ శివారులో డ్రీమ్ మిడాస్ వెంచర్‌లో లో జరిగిన హత్య కేసును ఛేదించిన కొత్తూరు పోలీసులు,మీడియా సమావేశంలో వెల్లడించిన షాద్ నగర్ ఎసిపి లక్ష్మీనారాయణ కేవలం రూ.20 వేల అప్పు తిరిగి చెల్లించే విషయంలో తలెత్తిన వివాదం ఓ యువకుడి ప్రాణాలను బలిగొంది. అప్పు డబ్బుల విషయంలో జరిగిన వాగ్వాదం హత్యకు దారితీసినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఫ్యూచర్ సిటీ పోలీసు కమిషనరేట్ పరిధిలోని కొత్తూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన సుమోటో హత్య కేసును పోలీసులు ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు ప్రాంతంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న బోడెక్ ప్రేమ్ కుమార్ (18) ఈ నెల 14వ తేదీన తిగాపూర్ గ్రామ శివారులోని డ్రీమ్ మిడాస్ వెంచర్‌లో హత్యకు గురయ్యాడు. వెంచర్‌లో యువకుడు హత్యకు గురైనట్లు సమాచారం అందడంతో కొత్తూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి గొంతుపై,ఛాతి,వీపు తదితర శరీర భాగాలపై పదునైన ఆయుధంతో దాడి చేసిన గాయాలను గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి ఉంటారని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేయగా,పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా మహమ్మద్ ఇర్ఫాన్ (20), మహమ్మద్ సవాజుద్దీన్ (23) అనే ఇద్దరు నిందితుల పాత్ర వెలుగులోకి వచ్చింది. ఇర్ఫాన్ హైదరాబాద్‌లోని బహదూర్‌పురా ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ కాగా, సవాజుద్దీన్ రంగారెడ్డి జిల్లా మైలార్దేవ్‌పల్లి పరిధిలోని ఉద్దండపల్లికి చెందిన ఆటో డ్రైవర్‌గా పోలీసులు గుర్తించారు. ఈ నెల 14వ తేదీ ఉదయం ఇర్ఫాన్ మృతుడు ప్రేమ్ కుమార్‌కు ఫోన్ చేసి గతంలో ఇచ్చిన రూ.20 వేల అప్పు తిరిగి చెల్లించాలని కోరినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. తక్షణమే డబ్బులు చెల్లించలేనని మృతుడు చెప్పడంతో,కలిసి బీరు తాగుదామని ఇర్ఫాన్ అతడిని డ్రీమ్ మిడాస్ వెంచర్ వద్దకు పిలిచాడు. అనంతరం సవాజుద్దీన్‌కు ఫోన్ చేసి బీరు సీసాలు తీసుకురావాలని కోరాడు. దీంతో ఇర్ఫాన్ మృతుడితో కలిసి వెంచర్‌కు వెళ్లగా,సవాజుద్దీన్ అక్కడికి బీరు సీసాలతో చేరుకున్నాడు. ముగ్గురూ కలిసి బీరు తాగుతున్న సమయంలో అప్పు డబ్బుల విషయమై ఇర్ఫాన్, ప్రేమ్ కుమార్ మధ్య వాగ్వాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఇర్ఫాన్ తన వద్ద ఉన్న కత్తితో ప్రేమ్ కుమార్ ఛాతి,వీపు తదితర భాగాలపై పలుమార్లు పొడిచినట్లు దర్యాప్తులో తేలింది. ఇర్ఫాన్ దాడి చేస్తున్న సమయంలో సవాజుద్దీన్ మృతుడిని గట్టిగా పట్టుకుని సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. అప్పు డబ్బుల విషయంలో తలెత్తిన వివాదమే ఈ హత్యకు ప్రధాన కారణంగా ప్రాథమిక విచారణలో నిర్ధారించారు. హత్య కేసును ఛేదించేందుకు పోలీసులు సంఘటనా స్థలానికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించడంతో పాటు రహస్య సమాచారాన్ని సేకరించారు. మృతుడిని నిందితులు ఫోన్ చేసి పిలిచిన కాల్ వివరాలను విశ్లేషించి, ఇతర ఆధారాలను సేకరించడంతో నిందితుల పాత్ర బయటపడింది. ఈ క్రమంలో అక్టోబర్ 15వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు తిమ్మాపూర్ ఎక్స్ రోడ్,కొత్తూరు వద్ద ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ,వైద్య పరీక్షల అనంతరం అక్టోబర్ 16వ తేదీన వారిని న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఫ్యూచర్ సిటీ పోలీసు కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి పర్యవేక్షణలో,షాద్‌నగర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సీహెచ్. శిరీష రాఘవేంద్ర మార్గదర్శకత్వంలో షాద్‌నగర్ డివిజన్ ఏసీపీ ఎస్. లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో ఈ కేసు దర్యాప్తు చేపట్టారు. కొత్తూరు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.నాగార్జున రెడ్డి, ఎస్సై ఎం.గోపాలకృష్ణతో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది కేసు ఛేదనలో కీలక పాత్ర పోషించారు. కేసును ఛేదించడంలో కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# వంద రూపాయల భోజనంలో కల్తీ నెయ్యి.?

**- ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు.. 100 కిలోలకు పైగా నెయ్యి సీజ్**

**- తక్కువ ధర బిర్యానీ వెనుక నాణ్యతపై అనుమానాలు.. సరఫరా నెట్‌వర్క్‌పై ఆరా**





**గుంటూరు(ప్రశ్న న్యూస్)** నగరంలో కల్తీ నెయ్యి వ్యవహారం కలకలం రేపుతోంది. తక్కువ ధరకు బిర్యానీ విక్రయించే కేంద్రాలకు కల్తీ నెయ్యి సరఫరా అవుతోందన్న అనుమానాల నేపథ్యంలో ఆహార భద్రత అధికారులు తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. ఈ తనిఖీల్లో సుమారు 100 కిలోలకు పైగా అనుమానాస్పద నెయ్యిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. వంద రూపాయలకే బిర్యానీ విక్రయించే దుకాణాలను లక్ష్యంగా చేసుకుని నెయ్యి సరఫరా జరుగుతోందా? నగరంలోని ఇతర బిర్యానీ కేంద్రాలకు కూడా ఈ ఉత్పత్తులు చేరుతున్నాయా? ఈ నెయ్యి ఎక్కడ తయారవుతోంది? సరఫరా వెనుక ఎవరున్నారు? అన్న ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. అయితే స్వాధీనం చేసుకున్న నెయ్యి కల్తీదేనని ప్రయోగశాల పరీక్షలు నిర్ధారించాయా లేదా అన్న వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

### వంద రూపాయల బిర్యానీ.. నాణ్యతపై సందేహాలు

బిర్యానీ అంటే చాలామందికి ఇష్టమైన వంటకం. ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులు, సామాన్య ప్రజలు తక్కువ ధరకు లభించే బిర్యానీ కేంద్రాలపై ఆధారపడుతుంటారు. ఈ నేపథ్యంలో వంద రూపాయలకే బిర్యానీ అందిస్తున్న దుకాణాలకు ఉపయోగించే నెయ్యి నాణ్యతపై అనుమానాలు వ్యక్తమైతే వినియోగదారుల్లో ఆందోళన కలగడం సహజం. తక్కువ ధరకు బిర్యానీ అందించేందుకు వ్యాపారులు ఎలాంటి ముడి పదార్థాలను వినియోగిస్తున్నారు? వంటల్లో ఉపయోగించే నెయ్యి నాణ్యమైనదేనా? సరఫరాదారులు అందించే ఉత్పత్తులపై దుకాణదారులు నాణ్యత ధ్రువీకరణను పరిశీలిస్తున్నారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే తక్కువ ధరకు బిర్యానీ విక్రయిస్తున్నారనే కారణంతోనే ఆహార పదార్థాలు కల్తీవని నిర్ధారించలేం. స్వాధీనం చేసుకున్న నెయ్యి నమూనాలను పరీక్షించి, వాటి నాణ్యతపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది. అప్పుడే అసలు విషయం వెలుగులోకి వస్తుంది.

### 100 కిలోలకు పైగా స్వాధీనం

ఆహార భద్రత అధికారుల తనిఖీల్లో సుమారు 100 కిలోలకు పైగా అనుమానాస్పద నెయ్యిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇంత పెద్ద మొత్తంలో నెయ్యి ఎక్కడి నుంచి వచ్చింది? ఏ సంస్థ లేదా వ్యాపారి సరఫరా చేశారు? ఏయే బిర్యానీ కేంద్రాలకు పంపిణీ చేస్తున్నారు? నిల్వ చేసిన ప్రదేశంలో ఇతర ఆహార పదార్థాలు కూడా ఉన్నాయా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాల్సి ఉంది. స్వాధీనం చేసుకున్న నెయ్యిని ప్రయోగశాలకు పంపించారా? పరీక్షల నివేదిక ఎప్పుడు వస్తుంది? నాణ్యత ప్రమాణాలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అన్న వివరాలను అధికారులు వెల్లడించాల్సి ఉంది. నమూనాల పరీక్షల ఫలితాలు, స్వాధీనం చేసుకున్న ఉత్పత్తుల వివరాలు ప్రజలకు తెలియజేస్తే వినియోగదారుల్లో నెలకొన్న సందేహాలకు సమాధానం లభిస్తుంది.

### బిర్యానీ సెంటర్లకు సరఫరా చేసేది ఎవరు?

ఈ వ్యవహారంలో అత్యంత కీలకమైన అంశం సరఫరా వ్యవస్థ. నెయ్యి ఒకే దుకాణంలో నిల్వ ఉందా? లేక పలు బిర్యానీ కేంద్రాలకు పంపిణీ చేసే ఉద్దేశంతో పెద్ద మొత్తంలో నిల్వ చేశారా? అన్నది విచారణలో తేలాల్సి ఉంది. అనుమానాస్పద నెయ్యి పలు దుకాణాలకు సరఫరా అవుతున్నట్లు ఆధారాలు లభిస్తే, సరఫరాదారుల నుంచి కొనుగోలుదారుల వరకు మొత్తం వ్యవస్థను పరిశీలించాల్సిన అవసరం ఉంది. బిర్యానీ తయారీకి ఉపయోగించే నెయ్యి, నూనెలు, ఇతర ముడి పదార్థాల కొనుగోలు బిల్లులను అధికారులు పరిశీలించాలి. ఉత్పత్తి తయారీదారు వివరాలు, బ్యాచ్ నంబర్లు, నిల్వ విధానం, సరఫరా రికార్డులను తనిఖీ చేయాలి. నిబంధనలకు విరుద్ధంగా ఉత్పత్తులు సరఫరా చేసినట్లు నిర్ధారణ అయితే సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలి.



### తనిఖీలతోనే సరిపెట్టొద్దు..

ఆహార భద్రత అధికారులు దాడులు నిర్వహించడం ఒక్కటే సరిపోదు. స్వాధీనం చేసుకున్న ఉత్పత్తులపై పరీక్షలు నిర్వహించి, ఫలితాలను వెల్లడించాలి. కల్తీ నిర్ధారణ అయితే సరఫరా మూలాలను గుర్తించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. నగరంలోని బిర్యానీ కేంద్రాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, హోల్‌సేల్ ఆహార పదార్థాల విక్రయ కేంద్రాల్లో కూడా నిబంధనల ప్రకారం తనిఖీలు చేపట్టాలి. ప్రజలు తినే ఆహార పదార్థాల నాణ్యత విషయంలో నిర్లక్ష్యం ఉండకూడదు. ముఖ్యంగా పెద్ద మొత్తంలో ఆహార పదార్థాలు తయారు చేసే కేంద్రాల్లో ముడి పదార్థాల నాణ్యతపై పర్యవేక్షణ అవసరం. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తే వాటిని తక్షణమే పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోవాలి.

### ప్రజల ఆరోగ్యానికి భరోసా ఎప్పుడు.?

గుంటూరులో 100 కిలోలకు పైగా నెయ్యి స్వాధీనం చేసుకున్నట్లు వెలువడిన సమాచారం నేపథ్యంలో అధికారులు పూర్తి వివరాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది. నెయ్యి కల్తీదా? ఏయే బిర్యానీ కేంద్రాలకు సరఫరా అవుతోంది? ఇప్పటికే వినియోగంలోకి వచ్చిందా? సరఫరా వెనుక ఉన్నవారెవరు? అన్న ప్రశ్నలకు విచారణ ద్వారా సమాధానాలు రావాలి. బిర్యానీ ధర తక్కువగా ఉండటం సమస్య కాదు.. వినియోగదారుడికి నాణ్యమైన ఆహారం అందుతోందా లేదా అన్నదే అసలు ప్రశ్న! కల్తీ జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో ప్రయోగశాల నివేదికలు రాకముందే ఏ ఉత్పత్తినీ కల్తీగా నిర్ధారించకూడదు. అధికారులు వాస్తవాలను ప్రజల ముందుంచి, ఆహార భద్రతపై నమ్మకాన్ని పెంచాల్సిన అవసరం ఉంది.

# నామినేషన్లు నిల్..

## పత్రాలు మాత్రం 118

**- మార్కాపురం మున్సిపల్ ఎన్నికల తొలిరోజు బోణీ కరువు**

**- 40 వార్డులు.. 10 క్లస్టర్లు.. నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన ఉన్నతాధికారులు**




**మార్కాపురం (ప్రశ్న న్యూస్)** మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది.. నామినేషన్ల పర్వం మొదలైంది.. కానీ తొలిరోజు మాత్రం బోణీ కాలేదు! మార్కాపురం మున్సిపాలిటీలో రెండో సాధారణ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైనా, ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. మరోవైపు హెల్ప్‌డెస్క్ ద్వారా ఏకంగా 118 నామినేషన్ పత్రాలను అభ్యర్థులు తీసుకెళ్లడం ఆసక్తి రేపుతోంది. పత్రాలు తీసుకెళ్లిన వారు నామినేషన్లు దాఖలు చేయకపోవడానికి కారణాలేమిటన్నది చర్చనీయాంశంగా మారింది. తొలిరోజు నామినేషన్లు సున్నా కావడంతో ఎన్నికల ప్రక్రియలో తదుపరి పరిణామాలపై ఆసక్తి నెలకొంది.

### ప్రారంభమైన ప్రక్రియ.. దాఖలు కాని నామినేషన్లు

మార్కాపురం మున్సిపాలిటీలోని 40 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణకు సమయం కేటాయించారు. నిర్ణీత సమయం ముగిసే వరకు ఒక్క అభ్యర్థి కూడా నామినేషన్ దాఖలు చేయలేదని మున్సిపల్ కమిషనర్ నారాయణరావు వెల్లడించారు.
ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో సందడి కనిపిస్తున్నప్పటికీ, నామినేషన్ల దాఖలులో మాత్రం తొలిరోజు ఎలాంటి కదలిక లేకపోవడం గమనార్హం. అభ్యర్థులు నామినేషన్ పత్రాలు తీసుకెళ్లి, అవసరమైన వివరాలు సిద్ధం చేసుకునేందుకు సమయం తీసుకుంటున్నారా? లేక ఇతర కారణాల వల్ల వేచి చూస్తున్నారా? అన్నది తెలియాల్సి ఉంది. అయితే, దీనిపై స్పష్టమైన సమాచారం లేకపోవడంతో ఇప్పుడే ఏదైనా కారణాన్ని నిర్ధారించడం సాధ్యం కాదు. ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థులను ఖరారు చేయడం, బలాబలాలను అంచనా వేయడం, స్థానిక సమీకరణాలను పరిశీలించడం వంటి అంశాలు నామినేషన్ల దాఖలుపై ప్రభావం చూపవచ్చు. అయితే, ఇవి సాధ్యమైన పరిణామాలు మాత్రమే.

# మూలా నక్షత్రం వేళ.. ఇంద్రకీలాద్రిపై జ్ఞానజ్యోతి

**- సరస్వతీ దేవి అలంకారంలో కనకదుర్గమ్మ.. చదువుల తల్లి దర్శనానికి పోటెత్తిన భక్తజనం**

**- విద్యార్థుల నుంచి పండితుల వరకు..**

**- విద్యాబుద్ధులు, విజ్ఞానం ప్రసాదించాలని జగన్మాతకు ప్రత్యేక పూజలు**



**విజయవాడ(ప్రశ్న న్యూస్)** విద్యకు వెలుగు.. విజ్ఞానానికి ప్రతిరూపం.. అక్షరానికి ఆది.. జ్ఞానానికి జ్యోతి.. వాక్కుకు అధిదేవత అయిన చదువుల తల్లి శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన జగన్మాత శ్రీ కనకదుర్గమ్మ భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో అత్యంత విశిష్టమైన మూలా నక్షత్రం సందర్భంగా శుక్రవారం అమ్మవారిని సరస్వతీ దేవి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి జన్మనక్షత్రంగా భావించే ఈ పవిత్ర పర్వదినాన దుర్గమ్మను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ పరిసరాలు అమ్మవారి నామస్మరణతో మార్మోగాయి. భక్తి, ఆధ్యాత్మికత, ఆరాధనలతో ఇంద్రకీలాద్రి పులకించిపోయింది.

**మూలా నక్షత్రం.. అమ్మవారి జన్మనక్షత్రం** దసరా శరన్నవరాత్రుల్లో మూలా నక్షత్రానికి ప్రత్యేక స్థానం ఉంది. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మను మూలా నక్షత్రం రోజున సరస్వతీ దేవి అలంకారంలో దర్శించుకోవడం భక్తులకు అత్యంత పవిత్రమైన అనుభూతి. దుర్గాదేవి మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి రూపాల్లో శక్తిని ప్రదర్శించే ఆదిపరాశక్తిగా భక్తులు ఆరాధిస్తారు. అందులో సరస్వతీ స్వరూపం జ్ఞానం, విద్య, సంగీతం, సాహిత్యం, కళలు, వాక్చాతుర్యానికి ప్రతీకగా నిలుస్తుంది.
అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞానమనే వెలుగును ప్రసాదించే తల్లిగా సరస్వతీ దేవిని పూజిస్తారు. అందుకే మూలా నక్షత్రం రోజున అమ్మవారిని దర్శించుకోవడానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కళాకారులు, సాహితీవేత్తలు ప్రత్యేక ఆసక్తి చూపుతారు. పిల్లలు చదువుల్లో రాణించాలని, పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని, ఉన్నత విద్యలో పురోగతి సాధించాలని తల్లిదండ్రులు అమ్మవారిని వేడుకుంటారు.దువుల తల్లి అలంకారంలో దుర్గమ్మసరస్వతీ దేవి అలంకారం కేవలం అమ్మవారి రూపాన్ని వీక్షించడానికే పరిమితమైనది కాదు. అది జ్ఞానానికి, వివేకానికి, సృజనాత్మకతకు, సత్యాన్వేషణకు ప్రతీక. సంప్రదాయంగా సరస్వతీ దేవిని శ్వేతవర్ణ వస్త్రధారిణిగా, వీణను ధరించిన వాగ్దేవతగా, జ్ఞానాన్ని ప్రసాదించే దివ్యమూర్తిగా భావిస్తారు.

# గజ్వేల్‌లో తీవ్రరూపం దాల్చిన కోతుల బెడద

**- భయాందోళనలో పట్టణ ప్రజలు.. అధికారుల చర్యల కోసం ఎదురుచూపులు**



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** గజ్వేల్ పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో కోతుల బెడద రోజురోజుకూ తీవ్రమవుతోంది. పట్టణంలోని ప్రధాన వీధులు, నివాస ప్రాంతాల్లో కోతులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను, వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇళ్లపైకి, దుకాణాలపైకి ఒక్కసారిగా దూసుకొస్తూ ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడమే కాకుండా, అడ్డువచ్చిన వారిపై దాడులకు పాల్పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, మహిళలు బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారని చెబుతున్నారు. కోతుల బెడద కారణంగా ఇళ్ల తలుపులు, కిటికీలు మూసి ఉంచాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల భద్రతపైనా ఆందోళన వ్యక్తమవుతోంది.

**తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్** కోతుల బెడదతో నిత్యజీవితానికి ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో మున్సిపల్, అటవీ శాఖ అధికారులు వెంటనే స్పందించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. కోతులను పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టి, నిబంధనలకు అనుగుణంగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలకు, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని గజ్వేల్ పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# తొలి మేయర్.. మంగళగిరి భవితకు కీలక మలుపు

**- పదవి ఒక్కటే కాదు.. పట్టణ ప్రగతికి దిక్సూచి**

**(మంగళగిరి, ప్రశ్న న్యూస్ బ్యూరో తోట వెంకట్)**

ఆంధ్ర ప్రదేశ్ రాజధాని ప్రాంతంలో కీలకంగా ఎదుగుతున్న మంగళగిరి--తాడేపల్లి నగరపాలక సంస్థకు తొలి మేయర్ ఎవరు? ఆ బాధ్యతలు చేపట్టే నాయకత్వం ఎలాంటిది కావాలి? పట్టణ భవిష్యత్తును నిర్దేశించే తొలి అడుగులు ఎలా ఉండాలి? ఇప్పుడు స్థానికంగా ఈ ప్రశ్నలపై చర్చ సాగుతోంది. మేయర్ పీఠం కోసం రాజకీయ పార్టీల్లో ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్న నేపథ్యంలో అభ్యర్థి ఎంపికపై ప్రజల్లోనూ ఆసక్తి పెరుగుతోంది. తొలి మేయర్ ఎంపిక అనేది కేవలం రాజకీయ పదవికి సంబంధించిన వ్యవహారం మాత్రమే కాదు.. రాబోయే రోజుల్లో నగరపాలక సంస్థ పాలనా దిశను ప్రభావితం చేసే కీలక నిర్ణయంగా మారనుంది. ఈ నేపథ్యంలో రాజకీయ సమీకరణాలు, సామాజిక వర్గాల లెక్కలు, పార్టీ విధేయతలకు తోడు అభ్యర్థుల వ్యక్తిత్వం, ప్రజలతో సంబంధాలు, స్థానిక సమస్యలపై అవగాహనకు ప్రాధాన్యం ఇవ్వాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### తొలి మేయర్.. తొలి ముద్ర

మంగళగిరి--తాడేపల్లి నగరపాలక సంస్థకు తొలి మేయర్‌గా బాధ్యతలు చేపట్టే వ్యక్తికి ప్రత్యేక ప్రాధాన్యం ఉండనుంది. తొలి పాలకవర్గం తీసుకునే నిర్ణయాలు, చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి అనుసరించే విధానాలు భవిష్యత్తు పాలనకు ఒక నమూనాగా నిలిచే అవకాశం ఉంది. అందుకే మేయర్ అభ్యర్థి ఎంపికపై ప్రధాన రాజకీయ పార్టీలు ఆచితూచి అడుగులు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. తొలి మేయర్ పదవిని దక్కించుకోవడం రాజకీయ పార్టీలకు ప్రతిష్ఠాత్మకమే అయినా.. ఆ పదవిలోకి వచ్చే వ్యక్తి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడం అంతకంటే ముఖ్యం. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలకు, పదవి చేపట్టిన తర్వాత చేసే పనులకు మధ్య స్పష్టమైన సంబంధం ఉండాలి. ప్రజల సమస్యలను వినడం, వాటి పరిష్కారానికి అధికార యంత్రాంగంతో సమన్వయం చేయడం, అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించడం వంటి అంశాల్లో మేయర్ చొరవ కీలకంగా మారనుంది.

### రాజకీయ బలమా? ప్రజాబలమా.?

మేయర్ అభ్యర్థి ఎంపికలో రాజకీయ సమీకరణాలు సహజమే. పార్టీకి చేసిన సేవలు, నాయకత్వంతో సంబంధాలు, సామాజిక వర్గాల ప్రాతినిధ్యం, స్థానిక రాజకీయ పరిస్థితులు వంటి అంశాలను పార్టీలు పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. అధికార తెలుగుదేశం పార్టీతో పాటు జనసేన, బీజేపీ కూటమి భాగస్వాములు, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా తమ వ్యూహాలకు అనుగుణంగా అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించనున్నాయి. అయితే రాజకీయంగా పలుకుబడి ఉండటమే ప్రజాప్రతినిధికి ప్రధాన అర్హత కాదన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ప్రజల మధ్య ఎంతకాలంగా ఉంటున్నారు? స్థానిక సమస్యల పరిష్కారానికి గతంలో ఏ విధంగా స్పందించారు? ప్రజలతో అందుబాటులో ఉంటారా? అందరినీ కలుపుకొని వెళ్లగలరా? వంటి ప్రశ్నలకు సమాధానాలు కూడా అభ్యర్థి ఎంపికలో కీలకంగా ఉండాలని పలువురు సూచిస్తున్నారు. టికెట్ ఆశిస్తున్న వారి సంఖ్య పెరుగుతున్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో పార్టీలు ఎలాంటి ప్రమాణాలను అనుసరిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. రాజకీయంగా తమకు అనుకూలంగా ఉండే వ్యక్తిని ఎంపిక చేస్తాయా? లేక ప్రజల అవసరాలను గుర్తించి పనిచేయగల నాయకత్వానికి ప్రాధాన్యం ఇస్తాయా? అన్న చర్చ మొదలైంది.

### నేర చరిత్ర, అవినీతి ఆరోపణలపై పరిశీలన




### అవసరం

ప్రజాప్రతినిధులుగా పోటీ చేసే వారి నేపథ్యాన్ని రాజకీయ పార్టీలు సమగ్రంగా పరిశీలించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అభ్యర్థులపై ఉన్న ఆరోపణలు, వాటికి సంబంధించిన వాస్తవాలు, న్యాయపరమైన పరిణామాలు, గత ప్రజా కార్యకలాపాలను పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్నంత మాత్రాన ఎవరినీ దోషిగా పరిగణించలేమన్న న్యాయసూత్రాన్ని గౌరవిస్తూనే, అభ్యర్థుల పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. అవినీతి, అక్రమాలకు సంబంధించిన ఆరోపణలు ఉన్నాయా? ఉంటే వాటి వాస్తవ పరిస్థితి ఏమిటి? ప్రజా ధనాన్ని వినియోగించే విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించే స్వభావం ఉందా? అన్న అంశాలపై పార్టీలు పరిశీలన జరపాలన్న డిమాండ్ వినిపిస్తోంది. వ్యక్తిగత ఆర్థిక బలం, రాజకీయ పలుకుబడి కంటే నిజాయితీ, ప్రజాసేవ పట్ల నిబద్ధత, జవాబుదారీతనం ముఖ్యమనే భావనకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

### స్థానికుల సమస్యలు తెలిసినవారికే ప్రాధాన్యమా.?

మంగళగిరి--తాడేపల్లి ప్రాంతం రాజధాని ప్రాంతంలో కీలకంగా ఉండటంతో ఇక్కడి పట్టణ సమస్యలు, అభివృద్ధి అవసరాలు ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకున్నాయి. స్థానికంగా నివసిస్తూ ప్రజలతో నిత్యం సంబంధాలు కలిగి ఉన్న వ్యక్తికి సమస్యలపై ప్రత్యక్ష అవగాహన ఉండే అవకాశం ఉంది. అయితే స్థానికత ఒక్కటే అర్హత కాకుండా, పరిపాలనా అవగాహన, ప్రజలతో మమేకమయ్యే స్వభావం, సమస్యల పరిష్కారానికి చొరవ వంటి అంశాలనూ పరిగణనలోకి తీసుకోవాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మంగళగిరి, తాడేపల్లి పరిధిలోని వివిధ ప్రాంతాల అవసరాలు ఒకేలా ఉండకపోవచ్చు. ఎక్కడ తాగునీటి సమస్య ఉంది? ఏ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలి? ఎక్కడ రహదారులు, వీధి దీపాలు అవసరం? పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి మార్పులు తీసుకురావాలి? వర్షాకాలంలో నీరు నిలిచే ప్రాంతాలు ఏవి? వంటి అంశాలపై అవగాహన కలిగిన నాయకత్వం అవసరం. ప్రజల మధ్య తిరుగుతూ వారి సమస్యలను తెలుసుకునే వ్యక్తి మేయర్‌గా ఉంటే పాలనా యంత్రాంగానికి సమస్యలను చేరవేయడం, పరిష్కారానికి ప్రాధాన్య క్రమం నిర్ణయించడం సులభమవుతుందని పలువురు భావిస్తున్నారు. స్థానికతతో పాటు సమర్థతను కూడా ప్రామాణికంగా తీసుకోవాలని సూచిస్తున్నారు

### అభివృద్ధి అజెండా ఎక్కడ.?

మేయర్ పదవిని చేపట్టే వ్యక్తి ముందున్న ప్రధాన బాధ్యత నగరపాలక సంస్థ పరిధిలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థ, రహదారులు, వీధి దీపాలు, చెత్త సేకరణ, ప్రజారోగ్యం, పార్కుల నిర్వహణ వంటి అంశాల్లో ప్రణాళికాబద్ధమైన చర్యలు అవసరం. పట్టణ విస్తరణకు అనుగుణంగా మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి కాలపరిమితితో కూడిన కార్యాచరణ రూపొందించడం కూడా కీలకమే. అభివృద్ధి పనుల నాణ్యతను పర్యవేక్షించడం, నిధుల వినియోగంలో పారదర్శకత పాటించడం, పనుల పురోగతిని ప్రజలకు తెలియజేయడం వంటి విధానాలు అమలైతే ప్రజల్లో పాలనపై విశ్వాసం పెరిగే అవకాశం ఉంది. మేయర్ అభ్యర్థులు ఎన్నికలకు ముందే తమ అభివృద్ధి ప్రణాళికను ప్రజల ముందు ఉంచితే, స్థానిక సమస్యలపై వారి అవగాహనను అంచనా వేసేందుకు అవకాశం ఉంటుందని పౌరులు అభిప్రాయపడుతున్నారు. కేవలం హామీలకే పరిమితం కాకుండా వాటి అమలుకు స్పష్టమైన కార్యాచరణ చూపించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.

### సామాజిక సమీకరణాలకే పెద్దపీటా.?

తొలి మేయర్ పదవిని ఎస్టీ సామాజిక వర్గానికి రిజర్వు చేసిన నేపథ్యంలో ఆ వర్గానికి చెందిన అభ్యర్థుల ఎంపికపై రాజకీయ పార్టీల్లో చర్చ సాగుతోంది. ఈ సామాజిక వర్గం నుంచి సమర్థులైన నాయకులను గుర్తించడం పార్టీల ముందున్న అంశం. అయితే రిజర్వేషన్ ద్వారా లభించిన అవకాశాన్ని అర్థవంతంగా వినియోగించుకోవాలంటే అభ్యర్థుల ఎంపికలో సామాజిక ప్రాతినిధ్యంతో పాటు ప్రజాసేవా దృక్పథం, నాయకత్వ లక్షణాలు, స్థానిక సమస్యలపై అవగాహనకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. సామాజిక వర్గాల సమీకరణాలు ఎన్నికల రాజకీయాల్లో భాగమైనప్పటికీ, మేయర్ పదవిలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు సమానంగా సేవలందించాల్సిన బాధ్యత ఉంటుంది. రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసే నాయకత్వం అవసరమని స్థానికులు పేర్కొంటున్నారు.

### తొలి ఎంపికతోనే భవిష్యత్తుకు బాట

మంగళగిరి--తాడేపల్లి నగరపాలక సంస్థ తొలి మేయర్ ఎంపిక ప్రధాన రాజకీయ పార్టీలకు ఒక కీలక పరీక్షగా నిలవనుంది. అభ్యర్థి ఎంపికలో పార్టీలు అనుసరించే ప్రమాణాలు, ప్రజల అభిప్రాయాలకు ఇచ్చే ప్రాధాన్యం, అభివృద్ధిపై ప్రకటించే కార్యాచరణ ఇప్పుడు చర్చనీయాంశాలుగా మారాయి. అభ్యర్థుల ఎంపికపై అధికారిక ప్రకటనలు వెలువడాల్సి ఉండగా, ఆశావహులు తమ ప్రయత్నాలను కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.

# ‘రణబాలి’ - మూవీ రివ్యూ!




లవ్ .. రొమాన్స్ నేపథ్యంలోని కథలలో, తనదైన మాస్ యాక్షన్ మార్క్ చూపిస్తూ విజయ్ దేవరకొండ ముందుకు వెళుతున్నాడు. అలాంటి విజయ్ దేవరకొండ ఈ సారి చారిత్రక నేపథ్యంలో కథను ఎంచుకుని .. లుక్ మార్చుకుని ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. అలా ఆయన చేసిన సినిమానే ‘రణబాలి’. పెళ్లి తరువాత విజయ్ దేవరకొండ – రష్మిక కలిసి చేసిన సినిమా కావడంతో సహజంగానే అంచనాలు పెరిగిపోయాయి. గతంలో చారిత్రక నేపథ్యం కలిగిన ‘శ్యామ్ సింగరాయ్’తో నానీకి హిట్ ఇచ్చిన రాహుల్ సాంకృత్యన్, ఈ సినిమాతో విజయ్ దేవరకొండకి కూడా హిట్ ఇచ్చినట్టేనా అనేది చూద్దాం.దఅది 1870ల నాటి కాలం .. భారతదేశంపై ఆంగ్లేయులు ఆధిపత్యాన్ని చెలాయిస్తున్న రోజులవి. బ్రిటీష్ కమిషనర్ (ఆర్నాల్డ్ వస్లూ) సీమ ప్రాంతం నుంచి 5 లక్షల టన్నుల ధాన్యాన్ని గూడ్స్ రైళ్ల ద్వారా తరలించి, మద్రాస్ ఓడరేవు నుంచి ఇంగ్లండ్ కి చేరవేసే ఆలోచనలో ఉంటాడు. అయితే అతనికి ‘శింగనమల’ ప్రాంతం నుంచి సవాల్ ఎదురవుతుంది. ఎందుకంటే ‘రణబాలి’ (విజయ్ దేవరకొండ) ఆ ప్రాంతానికి రక్షకుడిగా ఉంటాడు. అతనిని ఎదిరించే ధైర్యం .. ప్రశ్నించే దమ్ము ఎవరికీ లేవని ఆ ప్రాంత ప్రజలు నమ్ముతూ ఉంటారు. ‘శింగనమల’ ప్రజలు అక్కడి కొండపై గల గుహలో ఉన్న ఒక అతీత శక్తి తమని కాపాడుతుందని నమ్ముతుంటారు. ‘రణబాలి’ కారణజన్ముడనే విషయాన్ని అతని తల్లితో ఆ శక్తియే చెబుతుంది. అతను ఈ భూమిపైకి వచ్చిన కార్యం పూర్తవడానికి రెండు పుష్కరాల సమయం పడుతుందనీ, ఆ తరువాత అతను సమాధి చేయబడతాడని ఆ శక్తి చెబుతుంది. ఆ గండం నుంచి అతనిని గట్టెక్కించమని అందరి దేవుళ్లకి ఆ తల్లి దణ్ణం పెట్టుకుంటూ ఉంటుంది. అతను వయసులోకి అడుగుపెట్టిన తరువాత జయమ్మ ( రష్మిక)తో వివాహాన్ని జరిపిస్తుంది. సీమ ప్రాంతంలో కరవు ఏర్పడటానికి ప్రకృతి కారణం కాదనీ, తమ ప్రాంతంలోని ధాన్యాన్ని ఇంగ్లండ్ కి తరలించడానికి బ్రిటీష్ కమిషనర్ ప్రయత్నించడమేనని ‘రణబాలి’కి అర్థమవుతుంది. దానిని అడ్డుకోవడానికి అతను రంగంలోకి దిగుతాడు. అతని కారణంగా తిరుగుబాటు దారుల సంఖ్య పెరుగుతుందని భావించిన బ్రిటీష్ కమిషనర్, ఆవేశంతో బరిలోకి దిగుతాడు. అప్పుడు ఏం జరుగుతుంది? ఆంగ్లేయ అధికారి కోరిక నెరవేరుతుందా? రణబాలి ప్రయత్నం ఫలిస్తుందా? అనేది మిగతా కథ. ఆంగ్లేయుల కాలంలో వాళ్ల ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తూ ఆయా ప్రాంతాలలో వీరులు పుట్టుకొచ్చారు. ఆ వీరుల నాయకత్వంలో అక్కడి ప్రజలు తిరుగుబాటు జెండా ఎగరేశారు. అలా రాయలసీమ ప్రాంతం వైపు నుంచి ఆంగ్లేయుల పెత్తనాన్ని వ్యతిరేకించిన వీరుడిగా ‘రణబాలి’ని దర్శకుడు తెరపైకి తీసుకొచ్చాడు. రాయలసీమను మరింత కరవులోకి తోసేయడానికి ప్రయత్నించిన ఒక ఆంగ్లేయ అధికారికి .. అందుకు అడ్డుపడిన రణబాలికి మధ్య జరిగిన పోరాటమే ఈ కథ.

‘రణబాలి’ కారణజన్ముడిగా పుట్టడం .. వీరుడిగా ఎదగడం .. జయమ్మను పెళ్లి చేసుకోవడం .. అప్పటి వరకూ ఊరికి మొనగాడుగా ఉన్న ఆయన, ఆ తరువాత ఆ ప్రాంతంవారి ఆకలి తీర్చడానికి సిద్ధపడటం ఫస్టాఫ్ లో ప్రేక్షకుల ముందుకు వస్తాయి. ఇక ఆంగ్లేయ అధికారులకు వ్యతిరేకంగా అతను సాగించే ప్రయాణం .. చేసే పోరాటం సెకండాఫ్ గా తెరపైకి వస్తాయి. మొత్తం మీద లవ్ .. రొమాన్స్ .. యాక్షన్ .. ఎమోషన్స్ నేపథ్యంలో ఈ కథ నడుస్తుంది. చరిత్రకు సంబంధించిన ఘట్టాలను పుస్తకాలలో చదువుకోవడం తేలికగా ఉంటుంది. అందుకు సంబంధించిన సన్నివేశాలను తెరకెక్కించడం మాత్రం అంత ఆషామాషీ విషయమేం కాదు. దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ కూడా ఈ విషయంలో కొంతవరకు మాత్రమే సక్సెస్ అయ్యాడని చెప్పాలి. ఎందుకంటే పూర్తి ఫోకస్ ను చరిత్రపై పెట్టి, ఎంటర్టైన్ మెంట్ కి సంబంధించిన అంశాలను నిర్లక్ష్యం చేశాడనిపిస్తుంది. కథలో వినోదపరమైన అంశాలు చాలా తక్కువగా ఉండటం, చరిత్రకు సంబంధించిన ఘట్టాలను తేదీలు .. సంవత్సరాలతో కూడిన క్లిప్పింగ్స్ తో చూపించడం వలన, డాక్యుమెంటరీ ఫ్లేవర్ తగులుతుంది. ఆసక్తిని రేకెత్తించే ఎత్తులు .. పయ్యెత్తులు లేకపోవడం కాస్త అసంతృప్తిని కలిగిస్తాయి. ప్రీ క్లైమాక్స్ .. సముద్రతీరంలో జరిగే క్లైమాక్స్ ఫరవాలేదు. ఆ తరువాత వచ్చే సన్నివేశాలు కొనసాగింపుగా అనిపిస్తాయి. యాక్షన్ వైపు నుంచి చూస్తే కావలసినంత రక్తపాతం కనిపిస్తుంది. రొమాన్స్ .. ఎమోషన్స్ వైపు నుంచి మాత్రం గాఢత లోపించినట్టు అనిపిస్తుంది. కథ బలమైనదే అయినప్పటికీ .. కథనం చాలా నిదానంగా సాగుతుంది. ఇక ఇటు రణబాలి తల్లికి సంబంధించి తీసుకున్నా .. అతని భార్యకి సంబంధించి చూసుకున్నా కొన్ని సన్నివేశాలు ఆడియన్స్ ను ఇబ్బందిపెడతాయి. విజయ్ దేవరకొండ – రష్మిక కెమిస్ట్రీ గురించి ఆడియన్స్ కి తెలిసిందే. డిఫరెంట్ లుక్ తో .. ఇద్దరూ చాలా ఈజ్ తో చేశారు. ఆర్నాల్డ్ వస్లూ డీసెంట్ గా కనిపిస్తూ .. సైలెంట్ గానే తన విలనిజం చూపించారు. ఫొటోగ్రఫీ బాగుంది .. సీమ ప్రాంతానికి సంబంధించిన లొకేషన్స్ ను కవర్ చేసిన తీరు ఆకట్టుకుంటుంది. అజయ్ – అతుల్ నేపథ్య సంగీతం ఫరవాలేదు. బాణీల వైపు నుంచి చూసుకుంటే, ‘ఏందయ్యా సామీ’ పాట మాత్రమే మనసుకు హత్తుకుంటుంది. కార్తీక్ శ్రీనివాస్ ఎడిటింగ్ ఓ మాదిరిగా ఉంది .. ట్రిమ్ చేయవలసిన సన్నివేశాలు కొన్ని కనిపిస్తాయి.రాహుల్ సాంకృత్యన్ అల్లుకున్న ఈ కథ ఆసక్తికరమైనదే. అయితే ఆవిష్కరణ దగ్గరికి వచ్చేసరికి వేగం లోపించిన కథనంతో కదులుతుంది. 1870 కాలం నాటి వాతావరణాన్ని తెరపై ఆవిష్కరించడంలో ఆయన సక్సెస్ అయ్యాడని చెప్పాలి. విజయ్ దేవరకొండ – రష్మిక లుక్ .. నటన ఆకట్టుకుంటాయి. వాళ్లిద్దరి కెరియర్లో గుర్తుండిపోయే పాత్రలనే చెప్పాలి. కాకపోతే వాళ్లిద్దరి మధ్య రొమాన్స్ .. డ్యూయెట్లు ఆడియన్స్ ఆశించిన స్థాయిలో పడలేదేమో అనే భావన మాత్రం కలుగుతుంది.



# బాక్సాఫీస్ వద్ద ‘జైలర్ 2’ గర్జన

## తొలిరోజే ప్రపంచవ్యాప్తంగా రికార్డు కలెక్షన్లు!

సూపర్‌స్టార్ రజనీకాంత్ మరోసారి బాక్సాఫీస్ వద్ద తన స్టామినా ఏంటో నిరూపించారు. ఆయన కథానాయకుడిగా, నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ‘జైలర్ 2’ చిత్రం నిన్న థియేటర్లలోకి విడుదలైంది. విడుదలై తొలిరోజే వసూళ్ల సునామీ సృష్టించింది. ప్రముఖ ట్రేడ్ వర్గాల ప్రాథమిక అంచనాల ప్రకారం.. ఈ సినిమా మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా ఏకంగా రూ. 125.25 కోట్ల గ్రాస్ కలెక్షన్లను రాబట్టింది. ఇది తమిళ చిత్ర పరిశ్రమలో భారీ ఓపెనింగ్‌గా నిలిచింది. ప్రముఖ ట్రేడ్ ట్రాకర్ ‘శాక్‌నిల్క్’ వెల్లడించిన వివరాల ప్రకారం.. ‘జైలర్ 2’ భారత్‌లో తొలిరోజు రూ. 59.70 కోట్ల నెట్, రూ. 70.25 కోట్ల వసూళ్లను సాధించింది. దేశవ్యాప్తంగా దాదాపు 16,599 షోల ద్వారా ఈ వసూళ్లు రాగా, సగటున 55.4% ఆక్యుపెన్సీ నమోదైంది. మరోవైపు ఓవర్సీస్ మార్కెట్లలోనూ రజినీ మేనియా స్పష్టంగా కనిపించింది. విదేశాల్లో ఈ చిత్రం మొదటి రోజే రూ. 55 కోట్ల గ్రాస్‌ను కలెక్ట్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. మొత్తం మీద 37 లక్షలకు పైగా ప్రేక్షకులు తొలిరోజే ఈ సినిమాను థియేటర్లలో వీక్షించారు. భాషల వారీగా చూస్తే, తమిళ వెర్షన్ వసూళ్లలో అగ్రస్థానంలో నిలిచింది. ఒక్క తమిళనాడులోనే 9,326 షోల ద్వారా రూ. 43.35 కోట్ల నెట్ వసూలు చేసి, 70.8% భారీ ఆక్యుపెన్సీని నమోదు చేసింది. తెలుగు రాష్ట్రాల్లోనూ ‘జైలర్ 2’కు ఘన స్వాగతం లభించింది. ఇక్కడ ఈ చిత్రం తొలిరోజు రూ. 12.50 కోట్లు కలెక్ట్ చేసింది. ఇక హిందీలో రూ. 3.50 కోట్లు, కన్నడలో రూ. 0.35 కోట్లు వసూలు చేసింది. అత్యధిక వసూళ్లు సాధించిన రాష్ట్రాల్లో తమిళనాడు తర్వాత కర్ణాటక, ఆంధ్రప్రదేశ్-తెలంగాణ, కేరళ నిలిచాయి.

అయితే, ఇటీవల విడుదలైన ‘కూలీ’, ‘లియో’ చిత్రాల తొలిరోజు ప్రపంచవ్యాప్త వసూళ్లతో పోలిస్తే ‘జైలర్ 2’ కాస్త వెనుకబడినప్పటికీ, తమిళ సినీ చరిత్రలో ఇది మూడవ అతిపెద్ద ఓపెనింగ్‌గా నిలిచింది. ప్రస్తుతం వెలువడినవి ప్రాథమిక అంచనాలు మాత్రమేనని, తుది లెక్కల్లో స్వల్ప మార్పులు ఉండవచ్చని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు.

# హోటల్ గదికి రమ్మన్నాడు

## ఆ తర్వాత సినిమా నుంచి తీసేశాడు: విద్యా బాలన్



ప్రముఖ బాలీవుడ్ నటి విద్యా బాలన్ తన కెరీర్ తొలినాళ్లలో ఎదుర్కొన్న ఓ చేదు అనుభవం గురించి గతంలో చేసిన వ్యాఖ్యలు మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఓ దర్శకుడు తనను హోటల్ గదికి రమ్మని బలవంతం చేశాడని, ఆ తర్వాత తనను సినిమా నుంచి తొలగించాడని ఆమె వెల్లడించారు. చెన్నైలో ఓ యాడ్ ఫిల్మ్ షూటింగ్ కోసం వెళ్లినప్పుడు ఈ సంఘటన జరిగిందని విద్యా బాలన్ గుర్తుచేసుకున్నారు. అప్పటికే ఓ సినిమాకు సంతకం చేసిన తాను, ఆ చిత్ర దర్శకుడిని కలవాల్సి వచ్చిందన్నారు. “కాఫీ షాప్‌లో కలుద్దామని నేను చెప్పినా, అతను మాత్రం హోటల్ గదికి వెళ్లి మాట్లాడుకుందామని పదేపదే పట్టుబట్టాడు. అతని ఉద్దేశంపై అనుమానం రావడంతో, గదిలోకి వెళ్లాక నేను సమయస్ఫూర్తితో తలుపు తెరిచే ఉంచాను. దీంతో ఐదు నిమిషాల్లోనే అతను అక్కడి నుంచి వెళ్లిపోయాడు” అని విద్యా బాలన్ వివరించారు. అయితే, ఈ సంఘటన తర్వాత తనను ఆ ప్రాజెక్ట్ నుంచి తొలగించారని ఆమె పేర్కొన్నారు. ఆ దర్శకుడు ఎలాంటి తప్పుడు ప్రతిపాదన చేయనప్పటికీ, అతని ప్రవర్తనలోని ఉద్దేశాన్ని గ్రహించి అలా ప్రవర్తించానని తెలిపారు. ఇది పూర్తిస్థాయి క్యాస్టింగ్ కౌచ్ అనుభవం కాకపోయినా, స్వీయరక్షణ కోసం అప్రమత్తంగా వ్యవహరించానని స్పష్టం చేశారు. సినీ పరిశ్రమలో తనకు ఇలాంటి సంఘటనలు ఎక్కువగా ఎదురుకాలేదని, ఈ విషయంలో తాను అదృష్టవంతురాలినని విద్యా బాలన్ అన్నారు. ఏ అవకాశం కూడా భద్రతను పణంగా పెట్టేంత పెద్దది కాదని చెప్పారు.

# వాటి గురించి ఇప్పుడే చెప్పలేను



సాధారణంగా ఎక్కువమంది హీరోయిన్లు ‘మేం తింటాం కానీ వంట చేయలేం’ అంటుంటారు. కానీ శ్రీలీల మాత్రం ఎలాంటి వంటనైనా ఈజీగా చేసేస్తానంటున్నది. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో తనలోని పాకశాస్త్ర నైపుణ్యం గురించి శ్రీలీల మాట్లాడింది. ‘నాకు సాంబారు, కొబ్బరన్నం, కుర్మాకూర.. ఇలా చాలా వంటలు వచ్చు. అయితే.. ఎలాంటి వెరైటీ వండినా.. పెరుగన్నం మాత్రం నా మెనూలో పక్కగా ఉండాల్సిందే. చిన్నప్పట్నుంచీ పెరుగన్నమంటే చాలా ఇష్టం’ అని శ్రీలీల పేర్కొన్నారు. సినిమాల్లో ఎక్కువగా కనిపించడం లేదేంటి? అనడిగితే.. ‘గత కొన్ని రోజులుగా షూటింగులతో బిజీగా ఉన్నాను. నేను చేస్తున్న సినిమాలకు చెందిన వివరాల గురించి యూనిట్ సభ్యులు అధికారికంగా ప్రకటించలేదు. అందుకే ఆ సినిమాల గురించి నేను ఇప్పుడే చెప్పలేను. ప్రస్తుతానికైతే రెండ్రోజులు బ్రేక్ దొరికింది. ఈ విలువైన సమయాన్ని ఫ్యామిలీతో స్పెండ్ చేస్తున్నా’ అంటూ చెప్పుకొచ్చారు శ్రీలీల.



# ఆ రెండేళ్లూ నరకం చూశా..

## – ప్రతిరోజూ బతకడమే ఓ యుద్ధంలా ఉండేది: అనుపమ పరమేశ్వరన్

ప్రముఖ నటి అనుపమ పరమేశ్వరన్ తన గతానికి సంబంధించి కొన్ని సంచలన విషయాలను బయటపెట్టారు. గతంలో ఒక వ్యక్తితో ఉన్న రెండేళ్ల రిలేషన్‌షిప్‌లో తాను తీవ్రమైన మానసిక వేధింపునకు గురయ్యానని తెలిపారు. తన తాజా చిత్రం ‘క్రేజీ కళ్యాణం’ ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలలో ఈ విషయాలను వెల్లడించారు. ఆ అనుభవం తనను మానసికంగా కుంగదీసిందని, వృత్తిపరంగా ఎంతో నష్టపరిచిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆ చేదు అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ.. “అద్దంలో చూసుకుంటే మీరు మీకు కనిపించరు. ఆ సమయంలో నన్ను నేను గుర్తుపట్టలేకపోయాను. ప్రతిరోజూ బతకడమే ఓ యుద్ధంలా ఉండేది. మరుసటి రోజు ఏం జరుగుతుందోనన్న భయంతో గడిపాను” అని అనుపమ వివరించారు. ఆ సమయంలో నటనను కూడా వదిలేయాలనే ఆలోచన వచ్చిందని, కానీ కష్టంగానైనా షూటింగ్‌లకు హాజరయ్యానని చెప్పారు.

ఆ పరిస్థితుల ప్రభావంతో ఆ రెండేళ్లలో తాను నటించిన చిత్రాలలో సరిగ్గా నటించలేకపోయానని, ఇంకా మెరుగ్గా చేయాల్సిందిగా భావిస్తున్నానని అన్నారు. ఈ వేధింపుల వల్ల తాను పానిక్ ఎటాక్స్, బరువు తగ్గడం, కంటి సమస్యలు వంటి శారీరక ఇబ్బందులు కూడా ఎదుర్కొన్నట్లు అనుపమ తెలిపారు. మొదట ప్రేమగా ఉంటూ, తర్వాత కఠినంగా ప్రవర్తించి, మళ్లీ క్షమించమని అడగడం వంటివి ఎదుర్కొన్నానని పేర్కొన్నారు. అయితే, ఆ వ్యక్తి ఎవరనేది మాత్రం ఆమె వెల్లడించలేదు. ప్రస్తుతం తాను ఆ గతం నుంచి కోలుకుంటూ కెరీర్‌పై దృష్టి పెట్టినట్లు అనుపమ స్పష్టం చేశారు.

# ‘డ్రాగన్’ షూటింగ్‌కి రీఎంట్రీ ఇచ్చిన ఎన్టీఆర్..



మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ అభిమానులకు గుడ్ న్యూస్. భుజానికి గాయం కావడంతో శస్త్రచికిత్స చేయించుకుని కొంతకాలం విశ్రాంతి తీసుకున్న తారక్.. తాజాగా తిరిగి సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం ‘డ్రాగన్’ చిత్రీకరణలో అక్టోబర్ 15న ఎన్టీఆర్ అడుగుపెట్టినట్లు సమాచారం. దీంతో ఈ సినిమా షూటింగ్ మళ్లీ వేగం పుంజుకోనుందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ‘డ్రాగన్’ సినిమా చిత్రీకరణ జరుగుతున్న సమయంలో ఎన్టీఆర్ భుజానికి గాయం కావడంతో ఆయన శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చింది. వైద్యుల సూచన మేరకు కొంతకాలం విశ్రాంతి తీసుకోవడంతో ఆయన పాల్గొనాల్సిన సన్నివేశాల చిత్రీకరణ తాత్కాలికంగా నిలిచిపోయింది. అయితే షూటింగ్ పూర్తిగా ఆగిపోకుండా దర్శకుడు ప్రశాంత్ నీల్, చిత్ర బృందం ఎన్టీఆర్ లేని సన్నివేశాలను చిత్రీకరిస్తూ వచ్చారు.తాజాగా ఎన్టీఆర్ కోలుకుని తిరిగి సెట్స్‌లోకి రావడంతో మిగిలిన చిత్రీకరణను వేగంగా పూర్తి చేసేందుకు చిత్ర బృందం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇకపై షూటింగ్ పూర్తయ్యే వరకు తారక్ వరుస షెడ్యూళ్లలో పాల్గొననున్నారని సమాచారం. మొదట ‘డ్రాగన్’ చిత్రాన్ని 2026 జూన్‌లో విడుదల చేయాలని భావించినప్పటికీ, షూటింగ్ ఆలస్యం కావడంతో విడుదల ప్రణాళికలో మార్పులు చోటుచేసుకున్నాయి. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని 2027 జూన్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర బృందం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అలాగే 2027 ఫిబ్రవరి నాటికి షూటింగ్ మొత్తం పూర్తి చేయాలని ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం. అయితే చిత్రీకరణ, విడుదల తేదీలపై నిర్మాణ సంస్థ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తున్నారు. అనిల్ కపూర్, బిజు మీనన్, అశుతోష్ రాణా, ఖుష్బూ సుందర్, అన్మమాన్ పుష్కర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ‘కేజీఎఫ్’, ‘సలార్’ చిత్రాలతో తనదైన శైలిని చాటుకున్న ప్రశాంత్ నీల్.. ఎన్టీఆర్‌తో ఎలాంటి కథను తెరకెక్కిస్తున్నారన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. భారీ యాక్షన్ సన్నివేశాలు, శక్తివంతమైన పాత్రలో తారక్ కనిపించనున్నారనే అంచనాలతో ఈ సినిమాపై ఇప్పటికే భారీ హైప్ ఏర్పడింది.

# నిధి అన్వేషణలో ‘వృషకర్మ’



అగ్ర కథానాయకుడు నాగచైతన్య నటిస్తున్న మిథికల్ థ్రిల్లర్ ‘వృషకర్మ’. మీనాక్షి చౌదరి కథానాయిక. కార్తీక్ దండు దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్‌తో కలిసి అగ్ర దర్శకుడు సుకుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ఈ విషయాన్ని తెలియజేస్తూ గురువారం మేకర్స్ ఓ ప్రకటనను విడుదల చేశారు. విడుదలకు ఇంకా 50రోజులు మాత్రమే సమయం ఉండటంతో ఓ సరికొత్త పోస్టర్‌ని కూడా విడుదల చేశారు.స్టైలిష్‌గా, యాక్షన్ అవతార్‌లో పదునైన కత్తులు అమర్చబడ్డ ఓ లోహపు తాడును ఆయుధంగా చేతబట్టి కనిపిస్తున్న నాగచైతన్యను ఈ పోస్టర్‌లో చూడొచ్చు. ఆయన చుట్టూ ఉన్న వాతావరణం తుఫానుని తలపిస్తున్నది. నిధి అన్వేషణ నేపథ్యంలో మైథాలజీ, అడ్వెంచర్ అంశాలతో.. ఎవరూ టచ్ చేయని పాయింట్‌తో భారీ స్థాయిలో ఈ సినిమా తెరకెక్కుతున్నదని మేకర్స్ తెలిపారు. నాగచైతన్య కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాకు ప్రీరిలీజ్ బిజినెస్ కూడా భారీగా జరిగిందని మేకర్స్ చెప్పారు. స్పర్ష్ శ్రీవాస్తవ విలన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రాగుల్ డి.హెరియన్, సంగీతం: అజనీష్ బి.లోక్‌నాథ్, సమర్పణ: బాపినీడు, నిర్మాణం: శ్రీవెంకటేశ్వర సినీచిత్ర, సుకుమార్ రైటింగ్స్.

# జగన్మోహనాకారంలో మలయప్ప..

## మోహినీ అవతారంలో మనోహరం

- మోహినీ రూపంలో శ్రీవారి కటాక్షం..
- కృష్ణస్వామితో కలసి కనువిందు
- భక్తుల గోవింద నామస్మరణ.. భజనలు, కోలాటాల నడుమ వైభవంగా పల్లకీసేవ



**తిరుమల(ప్రశ్న న్యూస్)** శేషాచల క్షేత్రం భక్తిభావంతో పరవశించింది. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజు మోహినీ అవతార వైభవం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. శుక్రవారం ఉదయం సర్వాలంకార భూషితుడైన శ్రీ మలయప్పస్వామివారు మోహినీ రూపంలో జగన్మోహనాకారంతో దర్శనమిచ్చారు. మరో తిరుచ్చిపై శ్రీకృష్ణస్వామివారు కొలువుదీరి భక్తులకు అభయమిచ్చారు. రెండు దివ్యమూర్తుల దర్శనంతో తిరుమల పురవీధులు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

**అడుగడుగునా హారతులు.. హరిలోక వైభవం**

గజరాజులు ముందు నడుస్తుండగా, భక్తజన బృందాల భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాలు, జీయ్యంగార్ల ఘోష నడుమ స్వామివారి పల్లకీసేవ వైభవంగా సాగింది. మోహినీ అలంకారంలో మలయప్పస్వామివారి దివ్యరూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మరోవైపు శ్రీకృష్ణస్వామివారి అలంకారం భక్తుల్లో భక్తిపారవశ్యాన్ని నింపింది.పురవీధుల్లో స్వామివారు ఊరేగుతుండగా భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. గోవింద నామస్మరణతో తిరుమల మార్మోగింది. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తిగా ఎదురుచూశారు. దివ్యమూర్తుల దర్శనంతో భక్తులు పులకించిపోయారు.

**మోహినీ అవతారం.. మాయపై దైవత్వం విజయం**

మోహినీ అవతారం వెనుక లోతైన ఆధ్యాత్మిక సందేశం దాగి ఉంది. జగత్తును ఆవహించే మాయామోహాలకు అతీతంగా భగవంతుని తత్త్వాన్ని గ్రహించాలనే సందేశాన్ని ఈ అవతారం అందిస్తుంది. సమస్త జగత్తు భగవంతుని లీలా విలాసమని, ఆయన అనుగ్రహంతోనే మానవుడు మాయామోహాలను అధిగమించి ఆధ్యాత్మిక ఉన్నతిని సాధించగలడని ఈ అవతారం చాటిచెబుతుంది.బాహ్య సౌందర్యం, ప్రాపంచిక ఆకర్షణలకు అతీతంగా దైవచింతనలో మనసును లగ్నం చేయాలనే భావనను మోహినీ అవతారం గుర్తుచేస్తుంది. భక్తి, విశ్వాసం, దైవానుగ్రహంతోనే ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు సాగగలమనే తత్త్వాన్ని భక్తులకు తెలియజేస్తుంది.

**వైభవంగా బ్రహ్మోత్సవాలు.**

టీటీడీ ఆధ్వర్యంలో జరుగుతున్న నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, జానకీ దేవి, రంగశ్రీ, ఆనంద సాయి, దర్శన్, నరేష్‌కుమార్, జేఈవోలు డాక్టర్ ఎ. శరత్, ప్రభల గోపీనాథ్, సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కావనూరులో వైఎస్సార్‌సీపీకి కొత్త ఊపు

- టీడీపీ యువసేన నాయకులు సహా 50 కుటుంబాల చేరిక
- ఆర్కే రోజా సమక్షంలో పార్టీ కండువాలు..
- కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి విమర్శలు



నింద్ర(ప్రశ్న న్యూస్) నగరి నియోజకవర్గంలోని కావనూరు గ్రామంలో రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. తెలుగుదేశం పార్టీకి చెందిన యువసేన నాయకులు, వారి అనుచరులు సుమారు 50 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. మాజీ మంత్రి, నగరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆర్కే రోజా సమక్షంలో ఈ చేరికల కార్యక్రమం నిర్వహించారు. మేళతాళాలు, బాణసంచా, ఊరేగింపుతో గ్రామంలో సందడి నెలకొంది. కొత్తగా పార్టీలో చేరిన వారికి రోజా కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ పరిణామం స్థానికంగా వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది.

**యువసేన నాయకుల చేరిక** కావనూరు గ్రామానికి చెందిన టీడీపీ యువసేన నాయకులు కిరణ్, మునిస్వామి, మణికంఠం, సాయి, లోకయ్యతో పాటు వారి అనుచరులు సుమారు 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. గ్రామంలో ఊరేగింపు నిర్వహించి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో రోజా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

గ్రామస్థాయిలో రాజకీయంగా చురుగ్గా ఉండే యువ నాయకులు, వారి అనుచరులు పార్టీ మారడం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. రాబోయే రోజుల్లో గ్రామాల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు భావిస్తున్నారు. అయితే, ఈ చేరికలపై టీడీపీ వర్గాల స్పందన తెలియాల్సి ఉంది.

**సూపర్ సిక్స్ హామీల అమలేది?** ఈ సందర్భంగా ఆర్కే రోజా మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చారని, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో విద్య, వైద్యం, రైతు సంక్షేమం, మహిళా సాధికారతకు సంబంధించిన పలు పథకాలను అమలు చేశారని పేర్కొన్నారు.

ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని రోజా విమర్శించారు. ఓట్ల కోసం హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

**గ్రామగ్రామాన పార్టీని బలోపేతం చేయాలి** రాబోయే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన సమాధానం చెప్పాలని రోజా పిలుపునిచ్చారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడంతో పాటు నగరి నియోజకవర్గంలో తన విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. గ్రామస్థాయిలో ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకోవాలని, పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.కావనూరులో టీడీపీ యువసేన నాయకులు, వారి అనుచరులు వైఎస్సార్‌సీపీలో చేరడం పార్టీకి కొత్త ఉత్సాహాన్నిచ్చిందని స్థానిక నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ, మాజీ ఎంపీటీసీ విజయ్, మాజీ ఎంపీపీ దీపమ్మ, ముని కృష్ణారెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకుడు శ్యామ్‌లాల్, రాష్ట్ర మహిళా విభాగానికి చెందిన మేరీ జయరాం, పార్టీ జిల్లా కార్యదర్శి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గరుడ వాహనంపై జగదేకనాథుడు

- లక్ష్మీకాసుల మాలలతో మెరిసిన మలయప్ప
- వర్షాన్ని లెక్కచేయని భక్తకోటి
- తిరుమాడ వీధుల్లో భారతీయ సంస్కృతుల మహాసంగమం

(తిరుమల ప్రజాప్రశ్న ఆంధ్రప్రదేశ్ బ్యూరో తోట వెంకట్)





ఆకాశం నుంచి జాలువారుతున్న వర్షపు చినుకులు.. నలుదిక్కులా మార్మోగుతున్న గోవింద నామస్మరణ.. కనులారా స్వామివారిని దర్శించుకోవాలని గంటల తరబడి నిరీక్షిస్తున్న భక్తకోటి.. మంగళవాయిద్యాల మధురనాదాలు.. గజరాజుల గంభీర నడక.. అడుగడుగునా కర్పూర హారతులు.. ఆధ్యాత్మికతకు ప్రతిరూపంగా నిలిచిన శ్రీవారి దివ్యరూపం,వాన చినుకులు పడుతున్నా.. భక్తుల మనసుల్లో భక్తి జ్వాలలు చల్లారలేదు,
జడివాన అడ్డొస్తున్నా.. గోవింద నామం ఆగలేదు.

**గంటల నిరీక్షణ అలసటను మిగల్చలేదు..** ఒక్కసారి స్వామివారి దర్శనం ఆ భక్తులకు కొండంత ఆనందాన్నిచ్చింది,కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో అత్యంత వైభవంగా జరిగే గరుడ వాహనసేవ శుక్రవారం రాత్రి భక్తిపారవశ్యానికి పరాకాష్ఠగా నిలిచింది. లక్ష్మీకాసుల మాలలతో సర్వాలంకార భూషితుడైన శ్రీ మలయప్పస్వామివారు గరుడ వాహనంపై కొలువుదీరి భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. నాలుగు మాడ వీధుల్లో సాగిన స్వామివారి ఊరేగింపు.. భక్తి, విశ్వాసం, సంప్రదాయం, జాతీయ సాంస్కృతిక వైభవాల అద్భుత సంగమంగా అలరించింది.

**గరుడ వాహనంపై గోవిందుడు.. కనులారా చూసి తరించిన భక్తకోటి**

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో గరుడ వాహనసేవకు ప్రత్యేక స్థానం. ఆ మహిమాన్విత ఘడియల కోసం భక్తులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తారు. ఆ నిరీక్షణకు తెరదించుతూ రాత్రి 6.30 గంటలకు గరుడ వాహనసేవ ప్రారంభమైంది. స్వామివారు లక్ష్మీకాసుల మాలధారిగా గరుడ వాహనంపై దర్శనమివ్వడంతో తిరుమల క్షేత్రం గోవింద నామస్మరణతో మార్మోగింది.స్వామివారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకున్న భక్తులు తన్మయత్వంలో మునిగిపోయారు. కొందరు చేతులు జోడించి ప్రార్థిస్తే.. మరికొందరు కన్నీటి పర్యంతమై కర్పూర హారతులు సమర్పించారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరిలోనూ ఒకటే భావన.. 'స్వామీ.. నీ దర్శనం మా అదృష్టం.. నీ కరుణే మా భాగ్యం!'గజరాజుల గంభీర నడక.. మంగళవాయిద్యాల నాదం.. భజన బృందాల సంకీర్తనలు.. కోలాటాల సందడి.. జీయ్యంగార్ల ఘోషల నడుమ గరుడ వాహనసేవ అంగరంగ వైభవంగా సాగింది. తిరుమాడ వీధులన్నీ భక్తజన సంద్రాన్ని తలపించాయి.

**వానొచ్చినా.. వెనక్కి తగ్గని భక్తి..**

మధ్యాహ్నం నుంచే వర్షం కురుస్తున్నా భక్తుల ఉత్సాహం తగ్గలేదు. ఆకాశం మబ్బులు కమ్ముకున్నా.. చినుకులు ముఖాన్ని తడిపినా.. స్వామివారి దర్శనం కోసం గ్యాలరీల్లో వేలాది మంది భక్తులు గంటల తరబడి వేచి ఉన్నారు.

వర్షం నుంచి తప్పించుకోవాలన్న ఆలోచన కన్నా.. స్వామివారిని కనులారా దర్శించుకోవాలన్న తపనే వారిలో ఎక్కువగా కనిపించింది. వర్షపు చినుకుల మధ్య తడుస్తూనే గోవింద నామస్మరణ చేసిన భక్తుల దృశ్యాలు గరుడోత్సవానికి ప్రత్యేక ఆధ్యాత్మిక శోభను తీసుకొచ్చాయి.

**వానకు తడిసిన శరీరాలు.. గోవింద నామంతో పులకించిన హృదయాలు!**

భక్తుల నిరీక్షణను దృష్టిలో ఉంచుకుని టీటీడీ గ్యాలరీల్లో వేచి ఉన్నవారికి అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు, బాదంపాలు, అల్పాహారం, బిస్కెట్ ప్యాకెట్లు అందించింది. వర్షంలోనూ భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టింది. భక్తులకు అందించిన సేవలు ఉపశమనాన్ని కలిగించాయని పలువురు సంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి భారీ ఉత్సవాల్లో వర్షం, రద్దీని దృష్టిలో ఉంచుకుని తాగునీరు, ఆహారం, వైద్య సహాయం, రాకపోకల నిర్వహణ వంటి ఏర్పాట్లు ఎంత కీలకమో గరుడసేవ మరోసారి గుర్తుచేసింది.

**గరుడుడిపై గోవిందుడు.. శరణాగతికి సంకేతం..**

వైష్ణవ సంప్రదాయంలో గరుడ వాహనసేవకు విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉంది. శ్రీమహావిష్ణువుకు పరమ భక్తుడైన గరుడాళ్వారిపై స్వామివారు విహరించడం భక్తి, శరణాగతి, దైవానుబంధానికి ప్రతీకగా భావిస్తారు.

పురాణ సంప్రదాయాల ప్రకారం గరుడుని దర్శనం భక్తులకు జ్ఞాన వైరాగ్యాలను ప్రసాదించే పవిత్ర అనుభూతిగా నిలుస్తుంది. గరుడ వాహనంపై కొలువుదీరిన శ్రీవారిని దర్శించుకుంటే తమ జన్మ ధన్యమవుతుందని భక్తులు విశ్వసిస్తారు.అందుకే గరుడసేవకు దేశం నలుమూలల నుంచి భక్తులు తరలివస్తారు.

# యూనిఫామ్‌తో ఆటలా.? ఇక కుదరదు

- పోలీసు డ్రెస్‌లో డ్యాన్సులు చేస్తే క్రమశిక్షణా చర్యలే
- వైరల్ వీడియోలపై డీజీపీ సీవీ ఆనంద్ సీరియస్
- ప్రైవేట్ వేడుకల్లో పాల్గొనడంపైనా హెచ్చరిక




**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** ఖాకీ యూనిఫామ్ అంటే కేవలం ఓ దుస్తు కాదు.. అది బాధ్యతకు ప్రతీక, ప్రజల రక్షణకు భరోసా.. చట్టాన్ని అమలు చేసే అధికారానికి గుర్తు.. పోలీసు శాఖ క్రమశిక్షణకు నిదర్శనం అలాంటి యూనిఫామ్ ధరించి డ్యాన్సులు చేయడం, ప్రైవేటు వేడుకల్లో పాల్గొంటూ వీడియోలు రూపొందించడం ఇకపై కుదరదని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే సిబ్బందిపై కఠిన క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు.

**వైరల్ వీడియోలతో కలకలం..**

ఇటీవల కొందరు పోలీసులు యూనిఫామ్‌లో డ్యాన్సులు చేస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం చర్చనీయాంశంగా మారింది. ఈ వీడియోల నేపథ్యంలో పోలీసు శాఖ క్రమశిక్షణ, యూనిఫామ్ గౌరవంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. దీంతో పోలీసు సిబ్బంది వ్యవహారశైలిపై ఉన్నతాధికారుల దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు.

**ఖాకీకి ఓ గౌరవం ఉంది..**

పోలీసు యూనిఫామ్ ధరించిన వ్యక్తి వ్యక్తిగతంగా చేసే ప్రతి పనీ శాఖ ప్రతిష్ఠతో ముడిపడి ఉంటుంది. విధి నిర్వహణలోనే కాకుండా, యూనిఫామ్‌లో ఉన్నప్పుడు ప్రవర్తన విషయంలోనూ బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంటుంది. ప్రజలు పోలీసులను చట్ట పరిరక్షకులుగా చూస్తారు. అలాంటి వ్యవస్థకు చెందిన సిబ్బంది యూనిఫామ్‌లో వినోద కార్యక్రమాల్లో పాల్గొనడం, డ్యాన్సులు చేయడం వంటి చర్యలు శాఖ గౌరవంపై ప్రభావం చూపే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రైవేటు వేడుకలకూ నిబంధనలు వర్తిస్తాయా.?**

పోలీసులు వ్యక్తిగత జీవితంలోనూ, సామాజిక కార్యక్రమాల్లోనూ పాల్గొనవచ్చు. అయితే యూనిఫామ్ ధరించి ఏ కార్యక్రమంలో పాల్గొంటున్నారు? ఆ కార్యక్రమ స్వరూపం ఏమిటి? శాఖ నిబంధనలు అనుమతిస్తున్నాయా? అనే అంశాలు కీలకం. యూనిఫామ్‌లో ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొనడం, అక్కడ డ్యాన్సులు చేస్తూ వీడియోలు సామాజిక మాధ్యమాల్లోకి రావడం వంటి అంశాలను అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నట్లు డీజీపీ హెచ్చరికలు సూచిస్తున్నాయి.

**ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు..**

యూనిఫామ్ గౌరవాన్ని కాపాడాలని, పోలీసు శాఖ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యవహరించరాదని డీజీపీ స్పష్టం చేశారు. ఆదేశాలను ఉల్లంఘించే సిబ్బందిపై శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో యూనిఫామ్‌లో వీడియోలు రూపొందించే పోలీసు సిబ్బంది ఇకపై మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**సోషల్ మీడియా సరదా.. శాఖకు తలనొప్పి..**

సోషల్ మీడియాలో గుర్తింపు కోసం కొందరు చేసే ప్రయత్నాలు ఒక్కోసారి వృత్తిపరమైన బాధ్యతలను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ముఖ్యంగా పోలీసు యూనిఫామ్‌లో తీసిన వీడియోలు వైరల్ అయితే అవి వ్యక్తిగత అంశంగా మాత్రమే మిగలవు. శాఖ ప్రతిష్ఠ, ప్రజల్లో పోలీసులపై ఉన్న విశ్వాసం వంటి అంశాలపైనా చర్చకు దారితీస్తాయి. అందుకే వ్యక్తిగత సరదాకు, అధికారిక గుర్తింపునకు మధ్య స్పష్టమైన హద్దు ఉండాల్సిన అవసరం ఉంది.

# తిరుచానూరు బరిలో పుష్ప మునిరామ్‌రెడ్డి

## - స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి సన్నాహాలు.?



**తిరుపతి రూరల్(ప్రశ్న న్యూస్)** తిరుచానూరు పంచాయతీ రాజకీయాలు ఆసక్తికర మలుపు తిరుగుతున్నాయి. శ్రీ పద్మావతి అమ్మవారు కొలువైన పవిత్ర క్షేత్రంలో సర్పంచ్ ఎన్నికల సందడి మొదలవడంతో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. పంచాయతీని జనరల్ మహిళా కేటగిరీకి కేటాయించడంతో ప్రధాన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సీనియర్ జర్నలిస్టు, అమ్మవారి భక్తుడు మునిరామ్‌రెడ్డి సతీమణి, భాజపా మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు, శ్రీ విజయ గణపతి ఆలయ ధర్మకర్త పుష్ప మునిరామ్‌రెడ్డిని స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దింపే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఇదే జరిగితే తిరుచానూరు ఎన్నికల్లో కొత్త రాజకీయ చర్చకు తెరలేవనుంది.

**సేవా కార్యక్రమాలే బలం..**

పుష్ప మునిరామ్‌రెడ్డి కుటుంబం ప్రజాసేవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సామాజిక అంశాలపై తనదైన ముద్ర వేసుకుందని అనుచరులు చెబుతున్నారు. ఎంఆర్‌ఆర్ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు, శ్రీ విజయ గణపతి స్వామి ఆలయం కేంద్రంగా ఆధ్యాత్మిక సేవలు, 'టాక్ ఆఫ్ ది టౌన్' పత్రిక ద్వారా ప్రజా సమస్యలపై గళమెత్తడం వంటి అంశాలు తమకు ప్రజల్లో గుర్తింపు తెచ్చాయని వారు పేర్కొంటున్నారు. హిందూ సంఘాల ప్రతినిధులతో కలిసి సనాతన ధర్మ పరిరక్షణకు చేస్తున్న కృషిని కూడా ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు.ప్రముఖ నటుడు సాయికిరణ్, ఆధ్యాత్మిక గురువు రాధా మనోహర్ దాస్ సహా పలువురు ప్రముఖులు, హిందూ సంఘాల ప్రతినిధులు గతంలో మునిరామ్‌రెడ్డి కుటుంబానికి అండగా నిలిచినట్లు ప్రచారం ఉంది. ఎన్నికల బరిలోకి దిగితే వీరి మద్దతు ఏ మేరకు లభిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

# మొక్కజొన్న మాటున గంజాయి తోట

## - డ్రోన్ నిఘాలో చిక్కిన అక్రమ సాగు



**దుత్తలూరు(ప్రశ్న న్యూస్)** పైకి చూస్తే మొక్కజొన్న పంట.. లోపల మాత్రం గంజాయి తోట! ఎవరికీ అనుమానం రాకుండా పచ్చని పంట మాటున మాదకద్రవ్యాల సాగుకు తెరతీశారు. రహస్యంగా నీటి సరఫరా కోసం డ్రిప్ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. సుమారు మూడు నెలలుగా సాగు సాగిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. అయితే, అక్రమ గంజాయి సాగుపై అందిన సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు డ్రోన్ సాయంతో పొలాలను పరిశీలించి గుట్టురట్టు చేశారు. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలోని దుత్తలూరు మండల శివారులో వెలుగుచూసిన ఈ ఘటన కలకలం రేపుతోంది. సుమారు 9.5 ఎకరాల విస్తీర్ణంలో తనిఖీలు నిర్వహించగా, అందులో దాదాపు రెండు ఎకరాల్లో గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తించారు. మొత్తం 1,731 గంజాయి మొక్కలను గుర్తించిన పోలీసులు ఏడుగురిని అరెస్టు చేయగా, మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు.

**మొక్కజొన్న మాటున మాదకద్రవ్యాల సాగు!**

వ్యవసాయం ముసుగులో అక్రమ వ్యాపారానికి తెరతీసినట్లు ఈ ఘటనలో పోలీసుల ప్రాథమిక దర్యాప్తు సూచిస్తోంది. సాధారణంగా పొలంలో మొక్కజొన్న పంట కనిపిస్తే ఎవరూ ప్రత్యేకంగా అనుమానించకపోవచ్చనే ఉద్దేశంతో దాని మధ్యలో గంజాయి మొక్కలను పెంచినట్లు పోలీసులు గుర్తించారు. బయటివారికి సులభంగా కనిపించకుండా పంటను పెంచుతూ, రహస్యంగా సాగు కొనసాగించినట్లు సమాచారం.గంజాయి మొక్కలు మూడు నుంచి ఆరు అడుగుల ఎత్తు వరకు పెరిగినట్లు పోలీసులు తెలిపారు. మొక్కలకు డ్రిప్ ద్వారా నీటిని అందిస్తున్నట్లు గుర్తించారు. దాదాపు మూడు నెలలుగా సాగు కొనసాగుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైందని పేర్కొన్నారు.మాదకద్రవ్యాల అక్రమ సాగును అడ్డుకునేందుకు పోలీసులు నిఘా పెంచిన నేపథ్యంలో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అయితే, ఇంతకాలం సాగు కొనసాగడానికి గల పరిస్థితులు ఏమిటి? పొలం ఎవరిది? సాగు వెనుక అసలు సూత్రధారులెవరు? పెట్టుబడులు ఎక్కడి నుంచి వచ్చాయి? అనే అంశాలపై దర్యాప్తు కీలకంగా మారింది.

**డ్రోన్ నిఘాతో గుట్టురట్టు**

దుత్తలూరు శివారులో గంజాయి సాగు జరుగుతోందన్న సమాచారం పోలీసులకు అందింది. దీంతో సంబంధిత పోలీసు బృందాలు రహస్యంగా వివరాలు సేకరించి, అనుమానిత ప్రాంతంపై నిఘా పెట్టాయి. అనంతరం డ్రోన్ సాయంతో సుమారు 9.5 ఎకరాల పొలాన్ని పరిశీలించగా గంజాయి సాగు బయటపడినట్లు పోలీసులు వెల్లడించారు.మొక్కజొన్న పంట మధ్యలో గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు గుర్తించి, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 1,731 గంజాయి మొక్కలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఘటనాస్థలాన్ని నెల్లూరు జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల పరిశీలించారు. అక్రమ సాగుకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# కిట్ క్యాట్.. పురుగుల ఫ్లేవర్

- లూలూ మాల్‌లో చాక్లెట్ కొనుగోలు చేసిన కస్టమర్‌కు చేదు అనుభవం
- చాక్లెట్‌లో పురుగులు కనిపించాయంటూ ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు
- పండుగల వేళ ఆహార భద్రతపై ఆందోళన.. తనిఖీలు చేపట్టాలని డిమాండ్




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పిల్లలు ఎంతో ఇష్టంగా తినే చాక్లెట్లలోనే పురుగులు కనిపిస్తే పరిస్థితి ఏమిటి.? బ్రాండెడ్ ఉత్పత్తులనే నమ్మి కొనుగోలు చేసే వినియోగదారుల ఆరోగ్యానికి భరోసా ఎక్కడ.? పండుగల సీజన్‌లో భారీగా విక్రయాలు సాగుతున్న వేళ ఆహార పదార్థాల నాణ్యతను పర్యవేక్షించాల్సిన బాధ్యత అధికారులపై లేదా.? కూకట్‌పల్లిలోని లూలూ మాల్‌లో కిట్ క్యాట్ చాక్లెట్ కొనుగోలు చేసిన ఓ కస్టమర్‌కు ఎదురైన చేదు అనుభవం ఇప్పుడు హైదరాబాదులో ఆహార భద్రతపై పలు ప్రశ్నలను లేవనెత్తుతోంది.

### కవర్ తెరవగానే కనిపించిన పురుగులు..

వివరాల్లోకి వెళితే కూకట్‌పల్లిలోని లూలూ మాల్‌లో ఓ కస్టమర్ కిట్ క్యాట్ చాక్లెట్ కొనుగోలు చేశాడు. దానిని తినేందుకు ప్యాకెట్ తెరవగా అందులో పురుగులు కనిపించాయని సదరు కస్టమర్ ఆరోపించాడు. ఎంతో నమ్మకంతో కొనుగోలు చేసిన చాక్లెట్‌లో ఇలాంటి పరిస్థితి ఎదురవడంతో అతను తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. వెంటనే ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేసి మాల్‌లో విక్రయిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేయాలని డిమాండ్ చేశాడు.

### పండుగల వేళ నాణ్యతపై నిఘా ఏది.?

దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకొని మాల్స్, సూపర్ మార్కెట్లలో ప్రత్యేక విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఆకర్షణీయమైన ఆఫర్లు, ఫెస్టివల్ స్పెషల్ సేల్స్‌తో వినియోగదారులను ఆకట్టుకుంటున్న వ్యాపార సంస్థలు అదే స్థాయిలో ఆహార భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నాయా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. చాక్లెట్లు, బిస్కెట్లు, స్వీట్లు, ఇతర ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలను కొనుగోలు చేసే సమయంలో వాటి నాణ్యత, గడువు తేదీ, ప్యాకింగ్ పరిస్థితులను పరిశీలించాల్సిన అవసరాన్ని ఈ ఘటన గుర్తుచేస్తోంది.

### అధికారుల తనిఖీలు ఎక్కడ.?

ఒకవేళ ప్యాకేజ్డ్ ఆహార పదార్థంలో పురుగులు ఉన్నట్లు నిర్ధారణ



అయితే, అది తయారీ సమయంలో జరిగిందా.? నిల్వలో నిర్లక్ష్యం కారణమా.? రవాణా సమయంలో ప్యాకెట్ దెబ్బతిందా.? అన్న అంశాలపై సమగ్ర విచారణ అవసరం. సంబంధిత ఉత్పత్తి బ్యాచ్, తయారీ తేదీ, గడువు తేదీ, నిల్వ పరిస్థితులను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలి. ఫిర్యాదుపై స్పందించి ఫుడ్ సేఫ్టీ అధికారులు నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించడంతో పాటు, నిబంధనల ఉల్లంఘన నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.



### పిల్లల ఆరోగ్యంతో చెలగాటమా.?

చాక్లెట్లు, బిస్కెట్లు వంటి పదార్థాలను పిల్లలు ఎంతో ఇష్టంగా తింటారు. తల్లిదండ్రులు కూడా బ్రాండెడ్ ఉత్పత్తులపై నమ్మకంతో వాటిని కొనుగోలు చేస్తుంటారు. అలాంటి ఆహారంలో కలుషితం ఉన్నట్లు తేలితే పిల్లల ఆరోగ్యంపై ప్రభావం పడే ప్రమాదం ఉంది. అందుకే తల్లిదండ్రులు పిల్లలకు ఏది పడితే అది ఇవ్వకుండా, నాణ్యతపై శ్రద్ధ చూపాలని నిపుణులు సూచిస్తున్నారు. సాధ్యమైనంతవరకు ఇంట్లో పరిశుభ్రంగా తయారుచేసిన ఆహారాన్ని అందించడం మంచిది. అయితే ప్యాకేజ్డ్ ఆహార పదార్థాల విషయంలోనూ నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాల్సిన బాధ్యత తయారీదారులు, విక్రేతలు, సంబంధిత అధికారులపై ఉంది.

### వినియోగదారుల నమ్మకాన్ని నిలబెట్టాలి..

ప్రజల ఆరోగ్యమే ప్రాధాన్యంగా భావించి ఆహార భద్రతా విభాగం అధికారులు స్పందించాలి. లూలూ మాల్‌లోని సంబంధిత ఉత్పత్తులపై తనిఖీలు చేపట్టి, ఫిర్యాదులోని ఆరోపణలను నిర్ధారించాలి. అవసరమైతే ఇతర ఆహార పదార్థాల నమూనాలను కూడా పరీక్షించాలి. ప్రజలకు సురక్షితమైన ఆహారం అందేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి. బ్రాండెడ్ ఉత్పత్తులపై వినియోగదారులు పెట్టుకున్న నమ్మకం వమ్ము కాకుండా చూడాలి. లాభాలే లక్ష్యమా, ప్రజారోగ్యానికి ప్రాధాన్యమా.? అన్న ప్రశ్నకు ఫుడ్ సేఫ్టీ అధికారులు చర్యల ద్వారా సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది.

# సికింద్రాబాద్‌లో కేజేఆర్ గార్డెన్ కూల్చివేత

- అక్రమ ఫంక్షన్ హాల్‌గా నిర్మించారని అధికారుల చర్యలు
- 1996 నుంచి కొనసాగుతున్న న్యాయపోరాటానికి తెర
- కోర్టు తీర్పుతో రంగంలోకి దిగిన కంటోన్మెంట్ బోర్డు



సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో దశాబ్దాలుగా వివాదాస్పదంగా ఉన్న కేజేఆర్ గార్డెన్‌ను కంటోన్మెంట్ బోర్డు అధికారులు శుక్రవారం పూర్తిగా నేలమట్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్మించి, ఫంక్షన్ హాల్‌గా నిర్వహిస్తున్న ఈ కట్టడంపై అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. న్యాయస్థాన ఆదేశాల మేరకు ఈ కూల్చివేత ప్రక్రియను చేపట్టారు. శుక్రవారం ఉదయం కంటోన్మెంట్ అధికారులు భారీ పోలీసు బందోబస్తు నడుమ యంత్రాలతో కేజేఆర్ గార్డెన్ వద్దకు చేరుకున్నారు. అనంతరం ఫంక్షన్ హాల్ నిర్మాణాన్ని కూల్చివేయడం ప్రారంభించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు రక్షణ చర్యలు చేపట్టారు. కొద్ది గంటల వ్యవధిలోనే ఆ నిర్మాణాన్ని అధికారులు పూర్తిగా నేలమట్టం చేశారు.సదరు స్థలంలో అక్రమ నిర్మాణంపై 1996 నుంచి న్యాయస్థానంలో వివాదం కొనసాగుతోంది. కేజేఆర్ గార్డెన్ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా ఫంక్షన్ హాల్‌ను నిర్మించి, వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తోందని కంటోన్మెంట్ బోర్డు గతంలోనే స్పష్టం చేసింది. దీనిపై సుదీర్ఘకాలం పాటు సాగిన న్యాయపోరాటంలో ఇటీవలే న్యాయస్థానం కంటోన్మెంట్ బోర్డుకు అనుకూలంగా తీర్పు వెలువరించింది. కోర్టు ఆదేశాల మేరకు కంటోన్మెంట్ అధికారులు ఈ కూల్చివేత ప్రక్రియను పూర్తి చేశారు. దీంతో దాదాపు రెండు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న వివాదానికి తెరపడినట్లయింది. అధికారులు ఈ చర్యతో కంటోన్మెంట్ ప్రాంతంలోని ఇతర అక్రమ నిర్మాణదారులకు గట్టి హెచ్చరికలు జారీ చేసినట్లయింది.

## భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం

# చివరి దశలో ఉంది

- త్వరగా ఒప్పందాన్ని ముగిస్తామన్న కేంద్రమంత్రి నిర్మల



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత్-అమెరికా మధ్య ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందం త్వరలోనే కార్యరూపం దాల్చనుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. అమెరికాతో జరుగుతున్న చర్చలు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయని ఆమె తెలిపారు. బ్యాంకాక్‌లో నిర్వహిస్తున్న ఐఎంఎఫ్-ప్రపంచ బ్యాంక్ వార్షిక సమావేశాల్లో భాగంగా ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఒప్పందానికి సంబంధించిన మొదటి దశ ఇప్పటికే ఖరారైందని, ప్రస్తుతం దీనికి సంబంధించిన న్యాయపరమైన ముసాయిదా (లీగల్ డ్రాఫ్ట్) సిద్ధం చేస్తున్నట్లు వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ తనకు వివరించారని నిర్మల తెలిపారు. త్వరలోనే ఈ ఒప్పందంపై సంతకాలు జరుగుతాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ వాణిజ్యంతో పాటు, ఇరు దేశాల ద్వైపాక్షిక ఆర్థిక, వాణిజ్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.ఈ సమావేశంలో భారత ఆర్థిక వ్యవస్థ పనితీరుపై కూడా మంత్రి ప్రసంగించారు. అంతర్జాతీయంగా అనేక అనిశ్చితులు నెలకొన్నప్పటికీ, భారత్ స్థిరమైన వృద్ధిని సాధిస్తోందని పేర్కొన్నారు. కొవిడ్ మహమ్మారి తదుపరి కాలంలో, గత నాలుగైదేళ్లుగా ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా భారత్ నిలిచిందని ఆమె గుర్తుచేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న సమ్మిళిత వృద్ధి విధానాలు, నైపుణ్యాభివృద్ధిలో పెట్టుబడులు, కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ వంటి చర్యల వల్లే ఇది సాధ్యమైందని ఆమె వివరించారు. ప్రజాధనం వినియోగం పట్ల ప్రభుత్వానికి పూర్తి జవాబుదారీతనం ఉందని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.

# రాయదుర్గ్‌లో ఆటోల డబ్బుల దందా.?

- మీటర్ మాటే లేదు, చార్జీలకు హద్దే లేదు
- మెట్రో దిగాక ప్రయాణికులకు చుక్కలు,
- ఇష్టారాజ్యంగా వసూళ్లంటూ ఆరోపణలు
- సీరియల్ నంబర్ల ఊసేది.? డబుల్ పార్కింగ్‌పై చర్యలేవీ.?
- ఐటీ ఉద్యోగులు, సామాన్యుల అవస్థలు పట్టవా.? ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ ఏదీ.?

హైదరాబాద్(ప్రశ్న న్యూస్ ) హైదరాబాద్ కుమెట్రో రైలు అందుబాటులోకి రావడంతో ప్రయాణం సులభమైందని భావిస్తున్న నగరవాసులకు చివరి గమ్యస్థానానికి చేరుకోవడం మాత్రం తీవ్ర సమస్యగా మారుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రాయదుర్గ్ మెట్రో స్టేషన్ వద్ద ఆటోల కోసం వేచి చూడటం.. ఇష్ట రాజ్యాంగ ఎంత అడిగినా చార్జీ చెల్లించాల్సి రావడం.. ఆటోలు ఎక్కడపడితే అక్కడ నిలిపివేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కోవడం వంటి అనేక సమస్యలు ప్రయాణికులను వేధిస్తున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లే ఐటీ ఉద్యోగులు, ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన సామాన్య ప్రయాణికులు ఆటోల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంటోందని పలువురు వాపోతున్నారు. ప్రయాణికుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని ఆటో డ్రైవర్లు అత్యధిక చార్జీలు అడుగుతున్నారన్న ఫిర్యాదులపైనా ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. అయితే ఈ ఆరోపణలపై రవాణా శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

### చార్జీలకు ప్రామాణికత ఏదీ.?

ఆటోల దోపిడీకి అడ్డాగా హైదరాబాద్ మారిందన్న అనేక విమర్శలు ఉన్నాయి.రాయదుర్గ్ మెట్రో స్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల నుంచి వసూలు చేస్తున్న ఆటో చార్జీలపై స్పష్టత ఉండాలన్న డిమాండ్ వినిపిస్తోంది. ఒకే గమ్యస్థానానికి వెళ్లేందుకు ఒక్కో డ్రైవర్ ఒక్కో మొత్తం అడుగుతున్నారనే ఫిర్యాదులు ప్రయాణికుల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతున్నాయి. రద్దీ సమయాల్లో ఆటోలు అందుబాటులో లేకపోవడం, ప్రత్యామ్నాయ రవాణా సౌకర్యాలు పరిమితంగా ఉండటంతో ప్రయాణికులు మీటర్ తో సంబంధం లేకుండా ఎంత అడిగితే అంత చార్జీకి అంగీకరించాల్సి వస్తోందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆటో చార్జీల విషయంలో అమల్లో ఉన్న నిబంధనలు ఏమిటి.? హైదరాబాదులో ఆటోలు అసలు మీటర్లు ఉపయోగిస్తున్నారా.? మీటర్ విధానం వర్తించే చోట అది అమలవుతోందా.? నిర్ణీత చార్జీలు వర్తించే మార్గాల్లో వాటిని పాటిస్తున్నారా.? ప్రయాణికులకు ముందుగానే చార్జీల వివరాలు తెలిసేలా ప్రభుత్వం బోర్డులు ఏర్పాటు చేయలేరా.? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధిక చార్జీలు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తే వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. దీనిపై తనిఖీలు నిర్వహించి ప్రయాణికులకు భరోసా కల్పించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### సీరియల్ నంబర్ల విధానం ఏదీ.?

మెట్రో స్టేషన్ వద్ద ఆటోలు క్రమపద్ధతిలో నిలబడి ప్రయాణికులను ఎక్కించుకునే విధానం ఉంటే అనేక సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉంది. ఆటోలకు సీరియల్ నంబర్లు కేటాయించడం, వరుస క్రమంలో ప్రయాణికులను ఎక్కించుకునేలా చూడటం, ఆటోల నిలుపుదలకు ప్రత్యేక స్థలాన్ని గుర్తించడం వంటి చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రస్తుతం అక్కడ ఎలాంటి విధానం అమల్లో ఉంది.? ఆటో స్టాండ్ నిర్వహణకు సంబంధిత శాఖల నుంచి అనుమతులు ఉన్నాయా.? ఆటోలు ఎక్కడ నిలబడాలి.? ప్రయాణికులను ఎక్కడ ఎక్కించుకోవాలి.? అనే అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయా.? ఉంటే వాటిని అమలు చేస్తున్నారా.? ఈ విషయాలపై మున్సిపల్ ట్రాఫిక్, హెచ్ఎంఆర్ అధికారులు వివరాలు తెలపాలని కోరుతున్నారు. క్రమబద్ధమైన వ్యవస్థ లేకపోతే ఆటోల మధ్య పోటీ పెరగడంతో పాటు ప్రయాణికులకు అనేక ఇబ్బందులు కలుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీరియల్ నంబర్ల విధానం, నిర్దిష్ట పార్కింగ్ స్థలం, పర్యవేక్షణ సిబ్బంది ఏర్పాటు చేస్తే పరిస్థితిని మెరుగుపరచవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### డబుల్ పార్కింగ్‌తో ట్రాఫిక్ చిక్కులు..

రాయదుర్గ్ మెట్రో స్టేషన్ పరిసరాల్లో ఆటోల నిలుపుదలపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించాల్సిన అవసరం చాలా ఉందని ప్రయాణికులు కోరుతున్నారు. ఆటోలు క్రమపద్ధతి లేకుండా ఇష్ట రాజ్యాంగ నిలబడటం, ప్రయాణికులను ఎక్కించుకునే క్రమంలో ఒకదానికొకటి అడ్డుగా ఉండటం, రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించే పరిస్థితులు ఉన్నాయనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. డబుల్ పార్కింగ్ లేదా నిషేధిత ప్రాంతాల్లో వాహనాల నిలుపుదల జరుగుతున్నట్లు గుర్తిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయంగా క్రమబద్ధమైన పార్కింగ్ స్థలాన్ని చూపించాలి. కేవలం జరిమానాలు విధించడంతో సమస్య పరిష్కారం కాదు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా, ఆటో డ్రైవర్లకు కూడా స్పష్టమైన మార్గదర్శకాలు ఉండేలా హెచ్ఎంఆర్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### ఐటీ ఉద్యోగుల అవస్థలు కనిపించడం లేదా.?

రాయదుర్గ్ పరిసర ప్రాంతాల్లోని కార్యాలయాలకు రాకపోకలు సాగించే ఉద్యోగులకు మెట్రో కీలక రవాణా మార్గంగా ఉపయోగపడుతోంది. అయితే మెట్రో నుంచి ఇంటికి లేదా ఇతర గమ్యస్థానాలకు చేరుకునే చివరి దశ ప్రయాణం సజావుగా సాగకపోతే మెట్రో ప్రయాణం వల్ల లభించే ప్రయోజనం కొంతవరకు తగ్గిపోతుంది. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో విధులు ముగించుకుని బయటకు వచ్చే ఉద్యోగులకు ఆటోలు సులభంగా అందుబాటులో ఉండాలి.ఆటోల కోసం ఎక్కువసేపు వేచి ఉండాల్సి వస్తే ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు, ఇతర ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. రద్దీ సమయాల్లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఆటోలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోలేరా.? మెట్రో అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ సమన్వయంతో సమస్యను పరిష్కరించలేరా.? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

### ఫిర్యాదు చేయాలంటే మార్గమేది.?

అధిక చార్జీలు వసూలు చేసినా, ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తించినా, వాహనాన్ని క్రమరహితంగా నిలిపినా ఎవరికి ఫిర్యాదు చేయాలి.? ఫిర్యాదు చేసిన వారికి ఎంత సమయంలో



స్పందన లభిస్తుంది.? ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థ ఉందా.? అన్న విషయాలపై ప్రయాణికులకు స్పష్టత ప్రభుత్వం ఇవ్వాలి. ఆటో నంబరు, ప్రయాణించిన మార్గం, అడిగిన చార్జీ వంటి వివరాలతో ఫిర్యాదు చేసే సదుపాయం ఉంటే సమస్యలను గుర్తించడం అధికారులకు సులభమవుతుంది.మెట్రో స్టేషన్ వద్ద ఫిర్యాదుల వివరాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయడం, సంబంధిత అధికారుల సంప్రదింపు వివరాలను అందుబాటులో ఉంచడం, ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను సమీక్షించడం వంటి చర్యలు ప్రయాణికుల్లో విశ్వాసాన్ని పెంచుతాయి. ఆటో డ్రైవర్లపై వచ్చే ప్రతి ఆరోపణను వాస్తవంగా పరిగణించకుండా, ఇరుపక్షాల వివరణ తీసుకుని నిబంధనల ప్రకారం విచారణ జరపడం కూడా అంతే ముఖ్యం.

అధికారుల పర్యవేక్షణ ఎక్కడ.?

హైదరాబాదులో రోజురోజుకు పెరుగుతున్న ప్రయాణికులతో సమస్యలు తీవ్రమవుతున్నాయి. వాటిని కట్టడి చేయడంలో అన్ని శాఖలు విఫలమవుతున్నాయి అన్న ఆరోపణలు జరుగా వినిపిస్తున్నాయి.

రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు నిరంతర పర్యవేక్షణ అవసరం. ముఖ్యంగా మెట్రో స్టేషన్ పరిసరాల్లో వాహనాల రాకపోకలు, ఆటోల నిలుపుదల, ప్రయాణికుల ఎక్కింపు, దిగింపు వంటి అంశాలను ట్రాఫిక్ పోలీసులు క్రమబద్ధీకరించాలి. విధుల్లో ఉన్న సిబ్బంది సమస్యలను గుర్తించి తక్షణమే స్పందించేలా చర్యలు తీసుకోవాలి. ఉన్నత అధికారులు పూర్తిస్థాయి పర్యవేక్షణ చేసి అవసరమైతే రద్దీ సమయాల్లో ప్రత్యేక సిబ్బందిని నియమించి పరిస్థితిని పర్యవేక్షించాలి.

అధిక చార్జీలు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులపై రవాణా శాఖ తనిఖీలు చేపట్టడం, పార్కింగ్ సమస్యలపై ట్రాఫిక్ విభాగం చర్యలు తీసుకోవడం, మెట్రో అధికారులు ఆటో స్టాండ్ నిర్వహణపై సమన్వయం చేయాలని నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో నిబంధనలు పాటిస్తూ సేవలందించే ఆటో డ్రైవర్లకు ఇబ్బందులు కలగకుండా చూడాలి.




Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588